హైదరాబాద్ వార్త



# జిహెచ్ఎంసికి "బదిలీ" గండం..!

**-ఒక్కఏడాదిలోనే ముగ్గురు కమిషనర్లు మార్పు**
**-కార్పొరేషన్‌పై పట్టుసాధించే లోపే ట్రాన్స్‌ఫర్లు**
**-నాడు రోనాల్డ్‌రోస్, అమ్రపాలి, తాజాగా ఇలంబర్తి**
**-కమిషనర్ల మార్పుతో పలు ముఖ్యవిభాగాలపై ప్రభావం**




**హైదరాబాద్, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** జిహెచ్ఎంసికి "బదిలీ"ల గండం పట్టుకుంది. ఇక్కడ కమిషనర్‌గా వచ్చిన ఆఫీసర్లు ఎవరూ సరిగ్గా ఆరునెలలు ఉండలేకపోతున్నారు. గత ఏడాది కాలంగా అదే పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్‌లోని అన్ని వ్యవస్థలను అర్థం చేసుకుని గాడిలోపెట్టే లోపే ప్రభుత్వం బదిలీల అస్త్రం ప్రయోగిస్తుంది. దీంతో ఆప్రభావం పలు ముఖ్యవిభాగాలపై పడుతూ అనేక రకాలుగా నగర ప్రజలపై ప్రభావం చూపుతుంది. అలాగే పలు ఫైళ్లు సైతం పెండింగ్‌లో పడిపోతున్నాయి.దీంతో పాలన అస్థవ్యస్థంగా మారుతుంది. గత ఏడాది కాలంగా పరిశీలిస్తే జీహెచ్ఎంసీ కమిషనర్లుగా ముగ్గురు బదిలీ అయ్యారు. 2023జులైలో కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన రోనాల్డ్ రోస్ జూన్ 15 నుంచి సెలవుపై వెళ్లడంతో అప్పట్లో హెచ్ ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా ఉన్న అమ్రపాలికి ఇన్చార్జ్ కమిషనర్‌గా భాధ్యతలు అప్పగించారు. ఆ తరువాత జూన్ 24న రోనాల్డ్ రోస్ తిరిగి జాయిన్ అయినప్పటికీ అదే రోజు ఆయనను ఇంధనశాఖ సెక్రటరీ, ట్రాన్స్ కో, జెన్ కో సీఎండీగా బదిలీ చేసి తిరిగి ఆమ్రపాలికే పూర్థిస్థాయి బాధ్యతలను అప్పగించారు. జూన్ 26న బాధ్యతలు చేపట్టిన అమ్రపాలి ఐదు నెలల పాటు పనిచేయగానే ఏపీకి వెళ్లాలని కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆమ్రపాలి ఏపీకి వెళ్లడంతో తాత్కాలిక కమిషనర్‌గా ఇలంబరితికి బాధ్యతలు అప్పగించగా ఆతరువాత నవంబర్ 11న ఇలంబరితికి పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఇలంబర్తి ఆరు నెలలు కూడా పని చేయకముందే ఆయన్ను ఎంఏయూడీ సెక్రటరీగా ప్రభుత్వం బదిలీ చేస్తూ ఇలంబరతి స్థానంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ ను నియమించింది. ఈమేరకు మంగళవారం కమిషనర్‌గా ఆయన భాద్యతలు స్వీకరించనున్నారు.

### ఎవరిమార్కు వారిదే..

అయితే ఇప్పటివరకు పనిచేసిన కమిషనర్లలో ఒక్కో వర్కింగ్ స్టైల్ ఉంది. రోనాల్డ్ రోస్ 11 నెలలు కమిషనర్ గా పనిచేయగా, ఆమ్రపాలి 4 నెలలు, ఇలంబరితి 6 నెలలు కమిషనర్ పనిచేశారు. ఇందులో రోనాల్డ్ రోస్ కాస్తా ఎక్కువ రోజులు చేసినప్పటికీ పలు సంస్కరణలపై నిర్ణయాలు తీసుకునేలోపే బదిలీ అయ్యారు. ఇక ఆమ్రపాలి, ఇలంబరితిలకు ఆసమయం కూడా లభించలేదు. అలాగే కొత్తగా వచ్చిన ఆర్‌వి కర్ణన్‌కి సైతం ఫుడ్ సేఫ్టీ తనిఖీలు, చర్యలు తీసుకునే విషయంలో మంచి పేరొచ్చింది. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో భాగమైన తెలంగాణ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ గా పకడ్భంధీ చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో హోటల్స్, రెస్టారెంట్లు, హాస్టల్స్ తదితన వాటిపై వరుసగా దాడులు జరిపారు. ఇప్పుడు ఆయన జిహెచ్ఎంసి కమిషనర్‌గా బదిలీకావడంతో అనేక సవాళ్ల ఎదుర్కోవాల్సి ఉంది. ఇందులో ప్రధానమైనవి హెచ్‌సిటీ ప్రాజెక్టులు.. కబీఆర్ పార్కు చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్ ల నిర్మాణం పనులు వేగంగా చేయాల్సి ఉంది. దీనిపై ఇప్పటి వరకు కమిషనర్‌గా చేసిన ఇలంబర్తి దృష్టిసారించి రెగ్యులర్‌గా రివ్యూలు, ఫీల్డ్‌విజిట్‌లు సైతం చేశారు. అయినప్పటికీ భూసేకరణ తదితర కారణాల వల్ల ఆలస్యం అయ్యింది. దీన్ని వేగవంతం చేయాల్సి అవసరం ఉంది. అలాగే జీహెచ్ఎంసీ అప్పులు కూడా ఓ పెద్ద సమస్యగానే ఉంది. ఆమ్రపాలి, ఇలంబరితిలు కమిషనర్ గా ఉన్నంత కాలం కొత్త అప్పులు తీసుకురాకుండా ఉన్నదాంట్లోనే సరిపెట్టారు. మరో పక్కన ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ విషయంలో రికార్డు సృష్టించారు. ఎన్నడూ లేని విధంగా ఆదాయంలో రూ.2వేల కోట్ల మార్కు దాటింది. అలాగే కంటోన్మెంట్ విలీనం, ఏటిసి సెంటర్ ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణం, శానిటేషన్, స్ట్రీట్ లైట్లు, కొత్త డంపింగ్ యార్డుల తో పాటు అన్ని ప్రాజెక్టు లకి సంబంధించి భూసేకరణ విషయం పెద్ద సవాల్ గా చెప్పవచ్చు. ఇలా అన్ని పథకాలు చేపట్టాల్సిన పరిస్థితుల్లో కమిషనర్ బదిలీ కావడం, కొత్త కమిషనర్ రావడంతో ఆయాపనులపై ప్రభావం చూపుతుందని జిహెచ్ఎంసి వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

# అక్రమార్కుల గుండెల్లో 'నిఘా'

**- నేరాలకు, అక్రమాలకు అదే సాక్ష్యాధారాలు**
**- అంతటి ప్రాధాన్యత ఉన్న సిసి కెమేరాలు అంతంతే**
**- చాలా ప్రాంతాల్లో ఉన్నా..లేనట్లే**



**హైదరాబాద్,ఏప్రిల్28, ప్రభాతవార్త:** సీసీ కెమెరాలు మన వెన్నంటూ ఉండే నిఘా అస్త్రం.. నేరాలు, దొంగతనాలు, అక్రమాల నిందితులను పక్కాగా గుర్తించే సాక్ష్యం.. చాలామంది నేరస్తులను గుర్తించి శిక్షకు ఆధారంగా నిలిచింది. అలాంటి ఆయుధానికి ప్రాధాన్యత లోపించడం దౌర్భాగ్యమే. లక్షలాది మంది ఉండే జనసమూహంలో ఇదే మనపాలిట భద్రత, ఆపద్భబంధువని ఎందుకు తెలుసుకోలేకపోతున్నారు. అన్ని రకాల మనుషుల ఉండే సమాజంలో ఇది సరైన ఆయుధం కాదా? నగర పోలీస్ యంత్రాంగం సైతం నిర్లక్ష్యం చేస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఇక కార్పొరేట్ కార్యాలయాలు, కాలనీ సంఘాల సమన్వయంతో ఏర్పాటుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. దీంతో నేరాలు చాలావరకు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది. నగరంలో సుమారు మూడ్నాలుగు లక్షల నిఘానేత్రాలే ఉన్నాయని పోలీస్ రికార్డులు చెబుతున్నాయి. సగానికిపైగా ఏళ్లుగా పనిచేయడం లేదని తెలుస్తోంది.

### ప్రతీ కదలిక నిక్షిప్తం..

మన భద్రతకు ఆయుధం..ఒకింత భరోసా, ధైర్యంగా సీసీకెమెరాల సమాజంలో భాగమయ్యాయి. నేరస్తులను పట్టుకోవడం పోలీస్ వ్యవస్థకు చాలా తేలికైంది. ఇలా ఎన్నో విధాలుగా సహకరించే పరికరంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మియాపూర్, సికింద్రాబాద్, పాతబస్తీ, నారాయణగూడ, రాజేంద్ర నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, కూకట్‌పల్లితో పాటు మరెన్నో ప్రాంతాల్లో ఏళ్లుగా వందల్లో సీసీ కెమెరాలు నిరుపయోగంగానే ఉన్నాయి. మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా..పట్టించుకున్న దాఖలాలే లేకుండా పోయాయి. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో సీసీ కెమెరాలే ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. చిన్నపాటి దొంగ దగ్గర నుంచి అంతర్జాతీయ నేరస్తుల వరకు వీటి సహకారమే అధికంగా ఉంటుంది. ఒంటరి మహిళల మెడలో నుంచి బంగారు చైన్లు తెంపుకొని పారిపోయే దొంగ కదలికలను గుర్తించి పోలీసులకు దొరికెలా చేస్తుంది. కాలనీలు, కార్పొరేట్ కార్యాలయాల్లో, చిన్నపాటి సంస్థల్లో కూడా ఏర్పాటు చేసుకోవాలని నాటి నుంచి పోలీస్‌యంత్రాంగం ప్రచారం చేస్తూనే ఉంటుంది.

### సీసీకెమెరాలతో నేరాలకు చెక్...

సీసీకెమెరాలు అత్యాధునిక యంత్రం మంచి, చెడుతో పాటు నేరాలను నియంత్రించేందుకు సహకారం అందిస్తుంది. దొంగలు, అక్రమార్కులు, తప్పు చేసేవారు ఎవరైన భయంతో ఆచూతూచి అడుగెసిన సీసీకెమెరాలను చూసి వణికిపోతున్నారు. దీంతో చాలా వరకు నేరాలు చేయడానికి ధైర్యం చేయడం లేదు. అవిలేని చోటనే నేరాలు అధికంగా జరుగుతున్నాయని పోలీసులు పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయి కాలనీల అసోసియేషన్లతో అనేకంగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం..సీసీకెమెరాల ప్రయోజనాలను వివరిస్తున్నట్లు పోలీస్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఒక్కో కాలనీకి సుమారు పదిహేను వందలకు పైబడే అవసరం ఉంటున్నాయి. కొనుగోలుకు ప్రభుత్వం సైతం కొంతమేరకు నిధులను సమాకూరుస్తుందని కూడా వివరిస్తున్నాం. సీసీకెమెరాల ఉన్న చోట నేరాల శాతం ఘననీయంగా తగ్గిందని చెబుతున్నారు. నిఘాతీరుపై సరైన అవగాహన లేకపోవడంతోనే తేలికగా తీసుకుంటున్నారని తెలుస్తోంది. అది ఉన్న చోట నేరాలకు తావుండదని పోలీసులు సూచిస్తున్నారు.

## అత్యధిక శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నాం : సిపి సుదీర్ బాబు




**నేరెడ్ మెట్, రాచకొండ కమిషనరేట్, ఏప్రిల్ 28,ప్రభాతవార్త.** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల,షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ నేరాలపై సోమవారం రాచకొండ కమిషనరేట్ కార్యాలయములో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో షెడ్యూల్ కులాలపై దాడులు, వివక్షలకు సంబంధించిన కేసుల పరిణామాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసులను వేగంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసులను పరిశీలించి, వీలైనంత త్వరగా విచారణ పూర్తిచేసి న్యాయం అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం (అట్రాసిటీస్ యాక్ట్) కింద నమోదైన ప్రతి కేసు పట్ల కూడా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ.. తమ కమిషనరేట్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసుల్లో విచారణను వేగవంతం చేయడం ద్వారా అధిక శిక్షలు పడేలా చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. న్యాయ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా, బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, డిసిపి మల్కాజ్ గిరి పద్మజ ఐపిఎస్, డిసిపిఎల్బి నగర్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, యాదాద్రి అక్షాన్స్ యాదవ్ ఐపీఎస్, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, డిసిపి అడ్మిన్ ఇందిర, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ జి.నరసింహారెడ్డి, డిసిపి మహేశ్వరం సునీత రెడ్డి, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, అన్ని జోన్ల లాండ్ ఆర్డర్ ఏసీపీలు, తదితరులు పాల్గొన్నారు.

## పురస్కారాలు కళాకారుల్ని మరింత చైతన్యపరుస్తాయి

**-సాంస్కృతిక రంగానికి కళాదర్బార్ స్వర్ణోత్సవ సేవలు అమోఘం**




మథర్ ఇండియా వరల్డ్ రికార్డ్స్ అందుకొంటున్న కళాదర్బార్ అధ్యక్షుడు పి.రంగారావు దంపతులు తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** పురస్కారాలు కళాకారుల్ని మరింత చైతన్యవంతులను చేసి కళాపోషకులుగా తీర్చిదిద్దుతాయని, ప్రముఖ సాంస్కృతిక సేవాసంస్థ కళాదర్బార్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కళాసమ్రాట్ పొత్తూరి రంగారావు నేతృత్వం నిర్వహణలో గత 50ఏళ్లుగా కళలకు, కళాకారులు, యావత్ కళారంగానికి చేస్తున్న విశేష సేవలు అమోఘం అనితర సాధ్యమని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా కళాదర్బార్ 5 దశాబ్దాల కళాప్రస్థాన వీడియోను ప్రదర్శించారు. మథర్ ఇండియా వరల్డ్ రికార్డ్స్‌లో కళాదర్బార్, అధ్యక్షుడు పి.రంగారావు పేర్లను ఆయన 50ఏళ్ల కళాసేవకు గుర్తింపుగా నమోదు చేసి సదరు సర్టిఫికెట్‌ను ప్రముఖుల చేతులమీదుగా అందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక సౌజన్యంతో కళాదర్బార్ ఆధ్వర్యంలో సంస్థ స్వర్ణోత్స వాలు- స్వర్ణోత్సవ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం పొత్తూరి రంగారావు నేతృత్వంలో వైభవోపేతంగా జరిగింది. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగిన ఈ వేడుకల్లో సినీ, టీవి, విద్యారంగాలకు చెందిన సాయికుమార్, బాబుమోహన్, అలీ, రఘుబాబు, రాజీవ్ కనకాల, ప్రతీనిగమ్ తదితర పలువురు ప్రముఖులకు గోల్డెన్ జ్యూబ్లీ ఐకాన్ అవార్డులను; స్వాతి సోమనాథ్, టి.నాగరాజు, ప్రాశ మణిలకు గోల్డెన్ జ్యూబ్లీ కల్చరల్ ఐకాన్ అవార్డులను ముఖ్యఅతిథుగా విచ్చేసిన జనచైతన్య గ్రూప్స్ ఛైర్మన్ మాదాల సుధాకర్ దంపతులు, విశిష్ట ఎస్టేట్స్ జాయింట్ ఎండి ఆర్.వెంకటేశ్వర రావులు ఆత్మీయ అతిథులు సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ తదితరులతో కలిసి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. సభకుముందు జంటనగరాలకు చెందిన వర్ధమాన గాయకులచే సినీసంగీవ విభావరి, ప్రముఖ నృత్యగురువు స్వాతిసోమనాథ్ శిష్యులచే కూచిపూడి నృత్యప్రదర్శన, టి.నాగరాజుచే వేణుగాన కచేరీలు విచ్చేసిన అశేష ప్రేక్షకులను, కళాభిమానులకు అలరించి అబ్బురపరిచాయి.

## లేఔట్‌ల రూపాన్ని మార్చితే సహించేది లేదు

**-పార్కులు, రహదారులను కబ్జా చేస్తే కఠిన చర్యలు**
**-హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక**

**హైదరాబాద్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** లే ఔట్ రూపాన్ని మారిస్తే చర్యలు తప్పవని.. ఎవరికి వారు వారికి అనుగుణంగా లే ఔట్ రూపాన్ని మార్చేసి రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈమేరకు సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహింఇన ప్రజావాణికి మొత్తం 63 ఫిర్యాదులందగా.. లే ఔట్‌లలో రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జాలపై చాలావరకు ఫిర్యాదులుండడంతో ఈ అంశంపై దృష్టి పెట్టాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. ముఖ్యంగా శేరిలింగంపల్లి మున్సిపాలిటీ, గచ్చిబౌలిలోని సర్వే నంబరు 124, 125లో 20 ఎకరాల పరిధిలో ఫెర్టిలైజర్ కార్పొరేషన్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ కాలనీ లే ఔట్ ఉంది. 162 ప్లాట్లు కాగా.. రహదారులు, పార్కుల హద్దులు చెరిపేసి షెడ్డులు, నిర్మాణాలు చేపట్టి మొత్తం వాణిజ్య పరంగావినియోగించుకుంటున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తమ లే ఔట్‌లోని ప్లాట్లు, రహదారులు చూపాలని, వాటిని పునరుద్ధరించాలని అబ్యర్థించారు. రంగారెడ్డి జిల్లా పోచారం మున్సిపాలిటీలోని దివ్యానగర్ లేఔట్‌లో కూడా రహదారులను ఆక్రమించి షెడ్డులు, నిర్మాణాల్ని చేపట్టారని కొంతమంది ప్లాట్ యజమానులు ఫిర్యాదు చేశారు. తనకు అనుకూలంగా దివ్యానగర్ లేఔట్ ను మార్చుకుని ఇష్టానుసారం నిర్మాణాలు చేపట్టారని వాపోయారు. 200ల ఎకరాల దివ్యానగర్ లేఔట్ చుట్టూ ఉన్న ప్రహరీని తొలగించి.. రహదారుల్లో ఆంక్షలు లేకుండా చేసిన హైడ్రాకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. 2 వేలకు పైగా ఉన్న దివ్యానగర్ లే ఔట్‌లో హైడ్రా పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలని.. ఇందుకు అవసరమైన స్థలాన్ని తామిస్తామని అక్కడి భూ యజమానులు హనుమంతరెడ్డి, జైపాల్‌రెడ్డితో పాటు.. పలువురు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. శేరిలింగంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్, మసీదుబండ సీఎంసీ ఎన్‌క్లేవ్‌లో కూడా ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను ఓ వ్యక్తి ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఎన్‌క్లేవ్ నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మున్సిపాలిటీలోని తౌతానికుంటలో మట్టి నింపి .. భగీరథమ్మ చెరువుకు వెళ్లే వరద కాలువలు మూసేయడంతో తమ నివాస ప్రాంతాలను వర్షపు నీరు ముంచెత్తుతోందని గ్రీన్‌గ్రేస్ రెసిడెంట్స్ సొసైటీ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ గ్రామం సర్వే నంబరు 9, 10లోని పది ఎకరాల లే ఔట్‌లో పార్కుకు ఎకరం కేటాయించగా.. ఇప్పుడు అక్కడ కూడా ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారని నివాసితులు హైడ్రాను ఆశ్రయించారు. ఇలా ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులందడంతో గూగుల్ మ్యాప్స్, శాటిలైట్ ఇమేజీలలో గతంలో ఎలా ఉండేవి.. ఇప్పుడు ఎలా ఉన్నది అని ఆన్‌లైన్‌లో రంగనాద పరిశీలించారు.

ఆ నిర్మాణాలకు అనుమతులున్నాయా లేదా పరిశీలించి వెంటనే వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు.

### నిజాంపేట్ కార్పొరేషన్ మున్సిపల్ కార్మికుల మహాధర్నా

**-రెండు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వటానికి హామీ**

**నిజాంపేట్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త** కుత్బుల్లాపూర్ నియోజవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య, ఇతర కార్మికుల రెండు నెలల పెండింగ్ వేతనాల కొరకు ప్రగతి నగర్‌లోని కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉదయం ఐదు గంటల నుండి కార్మికులు విధులు బహిష్కరించి నిరవధికంగా మహాధర్నా నిర్వహించారు. గత రెండు వారాలుగా వేతనాలు, అనేక సమస్యల పరిష్కారం కొరకు కమిషనర్‌ని కలిసి రెండు పర్యాయములు వినతిపత్రం సమర్పించి సమస్యల పరిష్కారం కొరకు సామరస్యంగా చర్చించారు. వేతనములు ట్రెజరీల ద్వారా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆ ప్రక్రియ ఆలస్యం అయినందువలన వేతనాలు సమయా నికి ఇవ్వలేకపోయామని కమిషనర్ తెలిపారు. ట్రెజరీల నుంచి కాకుండా జనరల్ ఫండ్ నుంచే వేతనాలు ఇవ్వాలని డిమాండ్‌తో ధర్నా నిర్వహించటం జరిగిందని కార్మికులు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యల పరిష్కారం చేయవలసిన అవసరం కమిషనర్‌పై ఉందని తెలియజేశారు. రెండు మాసములుగా జీతాలు లేక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే జనరల్ ఫండ్ నుంచి ఈరోజే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విధులను బహిష్కరించి చెల్లించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పి పెంటయ్య, నాయకులు నరసింహ, శ్రీను, నరసమ్మ, పుష్పమ్మ, నారాయణ, మనీ, మహిపాల్, వెంకన్న, మద్దిలేటి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## 912 మైదానాల్లో 44 క్రీడల్లో శిక్షణ

**-45రోజులపాటు శిక్షణ ఇవ్వనున్న కోచ్‌లు**
**-ఆరేళ్లు పైబడిన వారికి పాల్గొనే అవకాశం**

**హైదరాబాద్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సమ్మర్ హాలీ డేస్ లో చిన్నారులు ఎంజాయ్ చేస్తూ, క్రీడల పట్ల ఆకర్షితులను చేసేందుకు జీహెచ్ఎంసీ ప్రతి ఏటా నిర్వహించే సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంప్‌లు మళ్లీ ప్రారంభమయ్యాయి. నిన్న మొన్నటి వరకు సిటీలో జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఈ సారి సమ్మర్ కోచింగ్ క్యాంప్ కాస్త ఆలస్యమైనా, ప్రతి సంవత్సరం మాదిరిగానే నెలన్నర రోజులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సిటీలోని 30 సర్కిళ్ల పరిధిలో జీహెచ్ఎంసీకి ఉన్న 912 క్రీడామైదానాల్లో ఈ క్యాంప్ లను నిర్వహించనున్నట్లు, మొత్తం 44 క్రీడాంశాల్లో ఆరేళ్ల పై బడి వయస్సున వారికి శిక్షణనివ్వనున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 44 క్రీడాంశాల్లో క్రికెట్, బ్యాడ్మింటన్ తో పాటు మరో క్రీడాంశంతో కలిపి మొత్తం మూడు క్రీడాంశాలకు ఈ శిబిరాల్లో శిక్షణనిచ్చేందుకు ఒక్కో సభ్యుడి నుంచి రూ. 50 ఫీజుగా వసూలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 150 వార్డులు కవరయ్యేలా ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్ లను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలి : అదనపు కమిషనర్ యాదగిరిరావు

జీహెచ్ఎంసీ వేసవి సెలవుల సందర్భంగా నిర్వహిస్తున్న సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంప్ లను విద్యార్థులు, క్రీడల పట్ల ఆసక్తి కల్గిన యువత సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (క్రీడలు) ఎన్. యాదగిరిరావు కోరారు. శనివారం ఈ సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంప్ లను లాంఛనంగా ప్రారంభించినప్పటికీ, సోమవారం నుంచి ఈ శిబిరాల్లో స్పోర్ట్స్ యాక్టివిటీస్ ఊపందుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతి సంవత్సరం ఈ కోచింగ్ క్యాంప్ లకు ఆదరణ పెరుగుతుందని, ఈ సారి కూడా సుమారు 50 వేల మంది శిక్షణకు వస్తారని అంచనాలు వేసినట్లు యాదగిరిరావు వెల్లడించారు. విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి చూపాలని, క్రీడలతో మంచి ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా పొందవచ్చునని ఆయన వివరించారు.

## హైదర్షాకోట్‌లో రెచ్చిపోయిన దొంగలు

**- లబోదిబోమంటున్న బాధిత ప్రజలు**

**నార్సింగి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** గండిపేట మండలం హైదర్షాకోట్ గ్రామంలో దొంగలు రెచ్చిపోయారు. ఒకే రోజు రాత్రి నాలుగు ఇళ్ల తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లిపోయారు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట మండలం హైదర్షాకోట్ గ్రామం శాంతినగర్ కాలనీలో ఆదివారం రాత్రి వరుసగా నాలుగు ఇళ్ల తాళాలు పగులగొట్టారు. బంగారు, వెండి నగలతో పాటు నగదును కూడా ఎత్తుకెళ్లిపోయారు. చంద్రారెడ్డి ఇంట్లో 2.తులాల బంగారు ఉంగరాలు, 2.చెవి దుద్దులు, వెండి చైన్, రాజేష్ ఇంటిలో 9.5.తులాల నెక్లేస్, మంగళ సూత్రాలు, కోమలి ఇంట్లో బంగారు నగలు, పట్నం రమేష్ ఇంట్లో తులం బంగారు నగలు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఇళ్లకు వచ్చి చూసుకున్న బాధిత ప్రజలు తమ ఇంట్లో దొంగలు పడి నగలు, నగదు దోచుకెళ్లినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం ఇళ్లను పరిశీలించారు. ఒకే కాలనీలో వరుసగా నాలుగు ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనం చేయడంను గమనిస్తే, ఇది పగటి పూట గమనించి రాత్రి వేళ దొంగతనం చేసినట్లు కనిపిస్తుందని పోలీసులు పేర్కొన్నారు. ఈ దొంగతనం జరిగిన విషయం తెలుసుకున్న శాంతి నగర్ కాలనీ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### లారీ ఢీకొనడంతో మహిళ మృతి

**ముషీరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనంపై భర్తతో కలసి వెళ్తూ ఉండగా లారీ ఢీకొని ఒక మహిల మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కే.ఎస్.రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చిట్యాల గ్రామానికి చెందిన అంబీర్ మధుసూదన్‌రావు తన భార్య శారద(50)తో కలసి ఆదివారం రాత్రి సుమారు పదకొండు గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై మెహిదీపట్నంకు వెళ్తూ ఉన్నారు. ఈ క్రమంలో వారి వాహనం ట్యాంక్‌బండ్‌పై నున్న తిక్కన్న సోమయాజి విగ్రహం వద్ద నుండి వెళ్తూ ఉండగా వెనుక నుండి అతి వేగంగా దూసుకువచ్చిన లారీ ఒక్కసారిగా వీరి వాహనాన్ని ఢీకొట్టింది. లారీ ఢీ కొనటంతో మధుసూదన్‌రావు, శారద ఒక్కసారిగా క్రింద పడ్డారు. శారద తలకు బలమైన గాయాలు కావటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, మధుసూదన్‌రావు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ప్రమాదానికి లారీ డ్రైవర్ షేక్ అష్రఫ్(25) రాష్ డ్రైవింగే కారణమని ప్రాథమిక నిర్ధారణలో తేలటంతో అష్రఫ్‌ను అదుపులోకి తీసుకుని, లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మధుసూదన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

### లిఫ్ట్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**-దారుణంగా హత్యచేసి పడేసిన గుర్తు తెలియని వ్యక్తులు**

**ముషీరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్ పంజాబ్‌నేసనల్ బ్యాంకు భవనంలోని లిఫ్ట్‌లో గుర్తు తెలియని వ్యక్తి (33) మృత దేహం కలకలం రేపింది. దోమలగూడ సీఐ శ్రీనివాసరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక భవనంలో సోమవారం ఉదయం రక్తపు మడుగులో ఒక వ్యక్తి నగ్నంగా పడి ఉండటం గమనించిన భవన యజమాని శ్రీధర్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులతో పాటు సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, గాంధీనగర్ డివిజన్ ఇన్‌చార్జి ఏసీపీ గురురాఘవేంద్ర, దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. కొన్ని గంటల ముందు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బలమైన రాయితో తలపై కొట్టి హత్య చేసి, లిఫ్ట్‌లో పడేసి ఉండవచ్చునని భావిస్తున్నారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌లు, సీసీ ఫుటేజీల ఆధారంతో తనిఖీలు చేపట్టి వివరాలు సేకరించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పటల్‌కు తరలించి, దర్యాప్తు ప్రారంభించారు. హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 8లో రక్తపు మరకలు, బట్టలు పడిఉండటం బట్టి, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వీధిలో హత్యచేసి, మృతదేహాన్ని లిఫ్ట్‌లో పడేసి పారిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. హత్యకు గురైన వ్యక్తి ఎవరు, హత్య చేసింది ఎవరు, హత్య ఎందుకు చేశారు అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

## సొంత కంపెనీ ఎంప్లాయిస్‌కే టోపీ పెట్టిన నందా ఫుడ్స్



ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ సయ్యద్ జిశాన్ అహ్మద్‌ని కలిసిన నందా ఫుడ్స్ కంపెనీ బాధితులు

**కొంపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 127 డివిజన్ నంద ఫుడ్స్ అనే పేరు మోసిన కంపెనీ రంగారెడ్డి నగర్‌లో గత 20 సంవత్సరాలుగా తన దగ్గర పనిచేస్తున్న ఎంప్లాయిస్‌కి ఈపీఎఫ్ కడుతున్నామని చెప్పి వారి జీతాలను కట్ చేసి ఇప్పుడు ఈపీఎఫ్ అప్లై చేసుకుంటే ఎవరికి ఈపీఎఫ్ అమౌంట్ రావట్లేదు. ఏంటా అని ఆరా తీస్తే ఎన్నో అవకతవకలు జరగాయని ఎంప్లాయిస్ పేరు తప్పుగా రాయడం ఎంప్లాయిస్‌కి ఎలాంటి పిఎఫ్ స్లిప్స్ ఇవ్వకపోవడం ఎన్నో సంవత్సరాలుగా కంపెనీ చుట్టూ తిరుగుతున్న బాధితులు. సోమవారం నందా ఫుడ్స్ కంపెనీలో నిర్వహించిన ఉమ్మడి జన సమన్వయ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ సయ్యద్ జిశాన్ అహ్మద్‌ని నందా ఫుడ్స్ కంపెనీ బాధితులు కలిసి తమకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. ఈ విషయమై విలేకరులు అడగగా బాధితులకు అండగా ఉంటానని వారి పీఎఫ్ అమౌంట్ అతి త్వరలో వారికి వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఓబీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తైలం శ్రీనివాస్, ఐఎన్‌టి యూసీ నాయకులు నాగరాజ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లయ్య కాక, బాల కృష్ణ, గురువా రెడ్డి, శ్యామ్, ఇఎస్ఐ పిఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి : బోయిని



ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి కోరుతూ ర్యాలీ చేపట్టిన ఓటిఏ ప్రతినిధులు

**అఫ్జల్‌గంజ్,ఏప్రిల్ 28(ప్రభాతవార్త):**

జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపి ప్రాణాలను బలి కొన్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఉస్మాన్‌షాహి ట్రేడర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున్న ర్యాలీ నిర్వహించారు. పాక్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉస్మాన్‌షాహి నుంచి బయలు దేరిన ర్యాలీ గౌలిగూడ, సిబిఎస్, అశోకబజార్ తదితర ప్రాంతాలల్లో ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఉస్మాన్‌షాహి ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బోయిని వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూదేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను జీర్ణించుకోలేని పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమాయక పర్యాటకులపై కాల్పులు జరిపి ప్రాణాలు తీయడం పిరికిపంద చర్య అన్నారు. ప్రాణాలుకొల్పియిన కుటుంబాలకు తమ ప్రగాడ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో ఒటిఏ ప్రతినిధులు రాహుల్‌గుప్త, పి. రామ్‌చందర్, రాజేంద్రప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, సతీష్‌కుమార్, బి. రాముయాదవ్, విష్ణు, సంపత్, అమిత్‌గుప్త, ఎల్.ఎం జోషి, జితేందర్ కుమార్, పి. బాస్కర్, మారుతి, విశాల్, సుశాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన కుటుంబాలకు కార్పొరేటర్ సంతాపం



కొవ్వోత్తుల ర్యాలీ చేపట్టిన కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్

**బేగంబజార్,ఏప్రిల్ 28(ప్రభాతవార్త):**

జమ్ముకాశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పులో మరణించిన పర్యాటకులకుఆత్మకు శాంతికలుగాలని కోరుతూ జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ ఆధ్వర్యంలో కోవ్వోత్తుల ర్యాలీ చేపట్టారు. సిబిఎస్, రామమందిరం, పత్తర్‌మజీద్ తదితర ప్రాంతాలల్లో స్థానిక ప్రజలతో కలిసి కోవ్వోత్తులువెలిగించి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల కాల్పులో మరణించిన కుటుంబాలకు తమ ప్రగాడ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

**పూల్‌బాగ్‌లో కొత్త నల్లా కనెక్షన్ ద్వారా మంచినీరు సరఫరా**

**గన్‌ఫౌండ్రి,ఏప్రిల్ 28(ప్రభాతవార్త):** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకుగాను అనునిత్యం కృషి చేయడం జరుగుతుందని గన్‌ఫౌండ్రి డివిజన్ బిజెపి కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్ బిస్వా అన్నారు. డివిజన్ పరిధిలోనిపూల్‌బాగ్ బస్తీలో స్థానికుల వినతి మేరకు మంచినీటి నల్లా కనెక్షన్ ఏర్పాటు చేయించి నల్లా నీరు పట్టి ప్రారంభించారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ కొత్త నల్లా కనెక్షన్ ఏర్పాటు చేయించి మంచినీటి ఇబ్బందులనుకలుగకుండా మంచినీటి నల్లా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీంతో మంచినీటి సమస్యను తీరినట్లు చెప్పారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

**కెసిఆరే తెలంగాణకు మొదటి విలన్: డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి**



**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

తక్కువ కాలంలో ఎక్కువ అవినీతి చేసింది కెసిఆర్ ఫ్యామిలీ అని, కెసిఆరే తెలంగాణకు మొదటి విలన్ అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి. వి. రవిశేఖర్‌రెడ్డి అన్నారు. వరంగల్ బిఆర్ఎస్ సభలో సోనియాగాంధీని విమర్శించే స్థాయి కెసిఆర్‌కు లేదన్నారు. పిసిసి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం వెంగళరావునగర్ కాలనీలో సోనియాగాంధీ చిత్రపటానికి రవిశేఖర్‌రెడ్డి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ తెచ్చింది, ఇచ్చింది సోనియాగాంధీ అన్నారు. సోనియాగాంధీ లేకపోతే వంద మంది కెసిఆర్‌లు వచ్చిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యేది కాదన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి పరిష్కారం కాని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు పరిష్కారం చేసిందని, ఇది యావత్ తెలంగాణ గుర్తించిందని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను విలన్‌గా అభివర్ణించడం సరికాదని అన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ దిశ మారుతుందని, యావత్ ప్రపంచం తెలంగాణ వైపు చూస్తుందని అన్నారు.

## కాంట్రాక్టు అధ్యాపకులతో ప్రభుత్వం చర్చలు జరపాలి : విసి ప్రొ. ఘంటా చక్రపాణి

**హైదరాబాద్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త:**

గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న అంబేద్కర్ వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు ధర్నా చేస్తున్న అంబేద్కర్ విగ్రహ ప్రాంతానికి విసి ప్రొ. ఘంటా చక్రపాణి వచ్చారు. ధర్నాలో ఉన్న కాంట్రాక్టు అధ్యాపకులకు తన సంఘీభావాన్ని ప్రకటించారు. వారి న్యాయమైన డిమాండ్లను, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానని వీసీ హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి వారితో చర్చలు జరపాలని సూచించారు. వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని ప్రభుతవానికి సూచించారు. డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘము అధ్యక్షుడు డా. కె. అవినాష్, ప్రధాన కార్యదర్శి డా.ఎం. కిషోర్, సలహాదారులు డా. కె యాదగిరి, డా. కాసం విజయ్, ఉపాధ్యక్షురాలు కె. ఉమాదేవి, సంయుక్త కార్యదర్శి డా. పి. రాధాకృష్ణ, కోశాధికారి డా. వై. కుమార్, కాంట్రాక్టు అధ్యాపకులు డి. కోటేశ్వర రావు, డా. పడాల లక్ష్మణ్ డా. సునీల్ కుమార్, డా.విజయ ఉషశ్రీ, డి శ్రీవేణి, డా.అరుణ సిద్ధాంతి, డా. కురుమేటి దయాకర్, నర్సయ్య భట్టు పాల్గొన్నారు.



కాంటాక్టు అధ్యాపకులకు సంఘీభావం తెలుపుతున్న విసి ప్రొ.ఘంటా చక్రపాణి

## వాహనదారులను అత్యవసర పరిస్థితులో సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడాలి

### -ఉత్తర మండలం ట్రాఫిక్ అదనపు డిప్యూటీ కమిషనర్ వేణుగోపాలరెడ్డి

**బేగంపేట ఏప్రిల్ 28,ప్రభాతవార్త**

ప్రజలు,వాహనదారులకు అత్యవసర పరిపస్థితులు ఎదురైనపుడు ట్రాఫిక్ సిబ్బంది సీపీఆర్ చేసి వారి ప్రాణాలు కాపాడాలని ఉత్తర మండలం ట్రాఫిక్ అదనపు డిప్యూటీ కమీషనర్ వేణుగోపాలరెడ్డి అన్నారు. సోమవారం ఉత్తర మండలం ట్రాఫిక్ అడిషినల్ డిసిపి వేణుగోపాల రెడ్డి పర్యవేక్షణలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జీ.శంకరరాజు ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరిధిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో ట్రాఫిక్ సిబ్బంది,మొబైల్స్‌పాయింట్ డ్యూటీ కానిస్టేబుల్స్‌కు ప్రధమ చికిత్స ,సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వడదెబ్బ ,హార్ట్‌ఎటాక్,అగ్ని ప్రమాదం,రోడ్డు ప్రమాదాలు సంబవించిన సమయంలో ట్రాఫిక్ సిబ్బంది ఏ విధంగా ప్రధమ చికిత్స అందించాలి, ప్రధమ చికిత్స కిట్లో ఉన్న మందులు పరికరాలు బ్యాండేజ్,డెటాల్,టాబ్లెట్లు,కాటన్ మొదలైన వాటిని ఎలా ఉపయోగించాలనే విషయాలను విపులంగా వివరించారు. ఈ శిక్షణలో ఉత్తర మండలం లోని వివిధ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు పాపయ్య, జుట్టు భాస్కర్,రవికు మార్, ఉపాశంక ర్,బి .వెంకటరాములు ఎస్సైలు,హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్ ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం ట్రాఫిక్ మొబైల్ డ్యూటీ ఆఫీసర్లకు ,ప్రధమ చికిత్స కిట్స్‌ను అందజేసారు.



ట్రాఫిక్ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో సిబ్బందితో ఉత్తర మండలం ట్రాఫిక్ అదనపు డిప్యూటీ కమీషనర్ వేణుగోపాలరెడ్డి.

## మే 1 నుండి రాష్ట్ర వ్యాప్తంగా" సమ్మర్ కోచింగ్ క్యాంప్"

**హైదరాబాద్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త:**

జంట నగరాల్లోని అన్ని స్టేడియాలతోపాటు 33 జిల్లాలలో మే 1వ తేదీ నుండి జూన్ 6 వరకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేన రెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు 2025 పోస్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి , వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం ఆలోచనల మేరకు యువకులు క్రీడాకారులు విద్యార్థులు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా క్రీడా మైదానాల వైపు ఆకర్షితులయ్యే విధంగా ఈ వేసవి శిబిరాలు ఉన్న నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచితంగా యోగ, జుంబా డాన్స్ లలో శిక్షణ ఇవ్వబోతున్నట్లు వివరించారు. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో పాల్గొనబోతున్న క్రీడాకారులు విద్యార్థులను ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, వివిధ ప్రవేటు సంస్థలు అందించే వేసవి శిక్షణ శిబిరాలు పేద మధ్యతరగతి విద్యార్థులకు క్రీడాకారులకు అందుబాటులో లేకుండా ఉన్నాయని స్పోర్ట్స్ అథారిటీ అందించబోయే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు అందరికీ అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి సోనీ బాలాదేవి డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శివసేనారెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు

## పహల్గం ఉగ్రదాడి తీవ్ర విచారకరం : తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

**సికింద్రాబాద్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గంలో జరిగిన ఉగ్రదాడిని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం గాంధీ విభాగం, జుడా, టి.యన్.జి.ఓ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అభం శుభం తెలియని, విదేశీయులు, పర్యాటకులు మరణించడం దురదృష్టకరమని, భారత ప్రభుత్వం తక్షణమే దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం గాంధీ యూనిట్ అధ్యక్షులు డాక్టర్ భూపేందర్ రాథోడ్ భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్ కుమారి, ప్రిన్సిపాల్ కత్తుల ఇందిర, డాక్టర్ శేషాద్రి, డాక్టర్ సునీల్ తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులకు తగిన గుణపాఠం నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం గాంధీ యూనిట్ ప్రతినిధులు డాక్టర్ అబ్బయ్య, డాక్టర్ మురళిధర్,డాక్టర్ రవి, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ మదన్, డాక్టర్ సుబోధ్, డాక్టర్ రాజేష్ , డాక్టర్ వెంకట మణి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ రజని వివిధ శాఖల అధికారులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి శేఖర్, డాక్టర్ వసంత్, డాక్టర్ కృష్ణ నాయక్, డాక్టర్ మురళీ కృష్ణ, డాక్టర్ సుధీర్, డాక్టర్ సందీప్ కుమార్ , డాక్టర్ బ్రహ్మేశ్వర, డాక్టర్ అనిల్, డాక్టర్ నాజిం, డాక్టర్ మీనాక్షి, డాక్టర్ సరిత, డాక్టర్ నవీన్, జూడ ప్రతినిధులు డాక్టర్ అజయ్, ఇతర నాయకులు, నర్సింగ్ ఆఫీసర్ ల సంఘం వైద్యులు నాయకులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థి విభాగం మరియు వైద్య విద్యార్థులు , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

## లాలాగూడ కేంద్రీయ రైల్వే హాస్పిటల్‌కు రోటరీ క్లబ్ వీల్ చైర్లు అందజేత



కార్యక్రమాన్ని ప్రారంబిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

**తార్నాక, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ జూబ్లీ హిల్స్, షార్ ప్రాజెక్టల సి.ఎస్.ఆర్ చొరవతో రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ లాలాగూడలోని కేంద్రీయ రైల్వే హాస్పిటల్‌కు 50 వీల్ చైర్లను విరాళంగా ఇచ్చింది. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలు ఎంతో గొప్పవన్నారు. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల రాజారాం, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ లోకేష్ విష్ణోయ్, రైల్వే మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ. శివనాగ ప్రసాద్ మరియు ఇతర రైల్వే అధికారులు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి, జిల్లా గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ రాం ప్రసాద్, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ బ్రాంచ్ అధ్యక్షుడు బాలకోటి రెడ్డి, ఇతర రోటరీ క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం



**నాచారం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :**

ఉప్పల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి కృషితో మల్లాపూర్ డివిజన్ అభివృద్ధికోసం రూ. కోటి 74 లక్షలు మంజూరు చేయించారు. దీంతో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి డివిజన్ పరిధిలో అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ ఆద్వర్యంలో నాయకులు పాలాబిశేకం చేశారు. ఈ సందర్భంగా కప్పర సాయికుమార్ గౌడ్ మాట్లాడుతూ బీరప్ప గద్ద నుంచి మల్లాపూర్ మానిక్ చంద్ వరకు రూ. 64 లక్షలతో బీటీ రోడ్డు, రూ. 35 లక్షలతో, వెంకటరమణ కాలనీలో సీసీ రోడ్డు పనులు,రూ 30 లక్షలతో, బ్రహ్మపురి కాలనీలో సీసీ రోడ్డు పనులు. రూ 45 లక్షలతో సింగం చెరువు తండా స్మశాన వాటికలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిళా నాయకులు కాలనీ వాసులు పాల్గొన్నారు.



నగరం లో జరిగిన హై లైఫ్ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## గంగపుత్రులకు తగిన న్యాయం చేయాలి : డాక్టర్ దేశబోయిన రఘు

**సికింద్రాబాద్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రంలో గంగపుత్రులకు జరుగుతున్న అన్యాయాన్ని ఇప్పటికైనా జరుగకుండా ఆపాలని తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది డాక్టర్ దేశ బోయిన రఘు రాష్ట్ర మత్స్యశాఖ అదరపు సంచాలకుడు మురళీకృష్ణను కోరారు. గంగపుత్ర సమస్యల పట్ల, గంగపుత్రుల హక్కులను సాధించుకోడానికి ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ చేపల వేట గంగపుత్రు/ బెస్త/ గుండ్ల కులస్తుల జన్మహక్కని గంగపుత్రులు/ బెస్తలు/ గూండ్ల కులస్తులు మాత్రమే సాంప్రదాయం మత్స్యకారులని చేపల వేటపై హక్కు గంగపుత్రులకు మాత్రమే కల్పించాలని కోరారు. అన్య కులస్తులు మత్స్యకారులు కాదని, ముదిరాజ్ / ముత్తి రాసి/ తెనుగు కులస్తుల వృత్తి పూలు పండ్లు అమ్ముట మాత్రమేనని, వారు వృత్తి మత్స్యకారులు కాదని తెలిపారు. మత్స్యకార సొసైటీలో వారికి సభ్యత్వం కల్పించొద్దని కోరారు. గత తెలంగాణ ప్రభుత్వం 2016లో తీసుకొచ్చిన జిఓ నెంబర్ 6 శాస్త్రీయ పద్ధతిలో జరగలేదని, ఈ జీవో ప్రకారం ఒక ఎకరా విస్తీర్ణంలో ఒక సభ్యత్వం కరెక్ట్ కాదని, దానివల్ల మత్స్యకారులకు జీవితం దుర్లభంగా మారిందని, ఒక్క ఎకరంలోని ఆదాయం కనీసం బిపిఎల్ లెవెల్ కంటే కింద ఉందని, జీవో నెంబర్ 6 వచ్చినప్పటి నుండి గంగపుత్ర ముదిరాజుల మధ్యల గొడవలు అధికమైయ్యాయని, జీవో నెంబర్ 6 ని వెంటనే రద్దు చేయాలని కోరారు. పాత విధానాన్ని కొనసాగిస్తూ రెండున్నర హెక్టార్లకు ఒక సభ్యుడిగా నమోదు చేయాలని కోరారు. అనంతరామన్ కమిషన్ 1970 సమర్పించిన రిపోర్ట్‌లో సూచించిన విధంగా గంగపుత్ర/ బెస్త/ గుండ్ల కులవృత్తి చేపల వేటని, మరియు ముదిరాజ్/ తెనుగు/ ముత్రాశి కులస్తుల కులవృత్తి పూలు పండ్లు అమ్ముట అని స్పష్టంగా ఉందన్నారు. కానీ గత ప్రభుత్వాలు అనంతరం కమిషన్లో మార్పులు చేస్తూ ముదిరాజ్ కులస్తులను కూడా చేపల వేటలో సభ్యత్వం ఇవ్వాలని అమెండ్మెంట్ తీసుకోవడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత గత ప్రభుత్వం జీవో నెంబర్ 4 ద్వారా 2022లో ముదిరాజులు తెలుగు ముత్తు రాసి ఒకటేనని ప్రకటించారు అలాంటి జీవోను గంగపుత్రులు అనుమతించరని దాన్ని కోర్టులో ఛాలెంజ్ చేసామని చెప్పారు. ఇందుకు సంబంధించిన కేసు పెండింగ్లో ఉంది కాబట్టి దాన్ని అమలు చేయవద్దని కోరారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత 2014 జీవో నెంబర్ 6 విడుదలైన తర్వాత గంగపుత్రులపై ముదిరాజుల దాడులు అధికమైనాయినీ విచక్షణారహితంగా గంగపుత్రులను కొట్టడమే కాకుండా మత్స్య సంపద దోపిడీ చేయడం, చెరువుల్లో విషాన్ని కలపడం, కరెంటు షాక్తో చేపలు చంపడం లాంటి అనేక సమస్యలను గంగపుత్రులు ఎదుర్కొంటున్నారన్నారు. అట్టి సమస్యలను అరికట్టడానికి సాంప్రదాయక మత్స్యకారులకు రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు అయినటువంటి ఎక్స్పర్ట్ కమిటీకి వినతిపత్రం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గంగ పుత్ర సం ఘం గౌరవ అధ్యక్షులు కైరం కొండ యాదగిరి కార్యదర్శి వంగల సుధాకర్ గారు సహాయ కార్యదర్శి కంటే సతీష్ గారు ఎగ్జిక్యూటివ్ నెంబర్ కడప వీరయ్యలు పాల్గొన్నారు.



రాష్ట్ర మత్స్యశాఖ అదరపు సంచాలకుడు మురళీకృష్ణను వినతి పత్రం అందజేస్తున్న దేశబోయిన రఘు తదితరులు

## బిసి బిల్లు ఊసే ఎత్తని కెసిఆర్ : గుజ్జ సత్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

తెలంగాణ జనాభాలో 50 శాతం ఉన్న బీసీల పట్ల బీఆర్ఎస్ వైఖరి ఏమిటని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రశ్నించారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ నిర్వహించిన సభలో గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ తన సుదీర్ఘ ప్రసంగంలో బీసీల ఊసే ఎత్తక పోవడం శోచనీయం అన్నారు. తెలంగాణ ఉద్యమం తరహాలో రాష్ట్రంలో బీసీ వాదం పెరిగిపోయిందని, బీసీల్లో వచ్చిన చైతన్యం చూసిన కాంగ్రెస్ సర్కార్ తప్పని పరిస్థితుల్లో బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు చేస్తూ అసెంబ్లీలో చట్టం చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ 18 నెలల పాలనలో ప్రతీ అంశం పై మాట్లాడిన కేసీఆర్ బీసీల ప్రస్తావన ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీ ప్రశ్నించిన కేసీఆర్ బీసీల హక్కులు, డిమాండ్ల పై ఎందుకు ప్రభుత్వాన్ని నిలదీయడం లేదని ప్రశ్నించారు. బీసీ బిల్లు అమలు పై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించాల్సి ఉండాల్సిందన్నారు. తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు కోసం న్యాయ నిపుణులతో చర్చించి బీసీ బిల్లు అమలు చేయడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నందున కేసీఆర్ తన వైఖరి స్పష్టం చేస్తే బీసీలు హర్షించేవారని తెలిపారు. బీసీ బిల్లును గవర్నర్ వద్దకు పంపకుండా కేంద్రానికి పంపి చేతులు దులుపుకున్న ప్రభుత్వం పై విమర్శనాస్త్రాలు సంధిస్తే బీసీల్లో ఆత్మవిశ్వాసం మరింత పెరిగేదన్నారు. బీహార్, తమిళనాడు ప్రభుత్వాలు గతంలో అనుసరించిన విధాన ప్రక్రియను ఇక్కడ కూడా పాటించాలని ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాల్సిందన్నారు. తమిళనాడులో రిజర్వేషన్లు పెంచినప్పుడు బిల్లులు పాస్ చేయడానికి చట్టాలు చేసినప్పుడు మొదట జీవోలు జారీ చేసి ఉద్యోగాలు భర్తీ చేశారు. తర్వాత కొందరు కోర్టు కు పోయినప్పుడు సుప్రీంకోర్టు రిజర్వేషన్లను కొట్టివేస్తే అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చి సవరణ చేసేలా కేంద్రం పై ఒత్తిడి తేవాలని సూచిస్తే బీసీలు బీఆర్ఎస్‌ను ఆదరించేవారని, బీసీల ప్రస్తావన లేక పోవడంతో బీసీలు ఆగ్రహంగా ఉన్నట్లు గుజ్జ సత్యం తెలిపారు.



## దురాశపరుల సంస్కరణోద్యమమే దిబ్బదేశానికి అవతల నాటకం

**-విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి**

**రవీంద్రభారతి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :**

సమాజంలో కార్మికులు, కూలీలు, దొంగలు, సృజనాత్మక కళాకారులు, దురాశపరుల వల్ల ఏదో ఒక విధంగా అణచివేయబడిన వారు సంస్కరణ కోసం చేసిన ఉద్యమ కథాంశమే దిబ్బదేశానికి అవతల నాటకం గొప్ప సందేశాన్ని అందిస్తుందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి మీడియాకు తెలిపారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని హైదరాబాద్ ప్రతీనెలా ఒక నాటక ప్రదర్శన కావిస్తూ అటు రంగస్థల రంగాన్ని, ఇటు కళాకారులు, సాంకేతికవర్గానికి ప్రోత్సాహంలో భాగంగా మంగళవారం 29 రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో థియేటర్ బ్రిడ్జి, హైదరాబాద్ వారి సమర్పణలో బాదల్‌సర్కార్ హాట్‌మాలా కే ఉస్‌పార్‌కు శివాల గోవిందరావు, వి.వికాస్ చైతన్యల తెలుగు అనువాదం, వికాస్ చైతన్య దర్శకత్వంలో రూపొందిన దిబ్బదేశానికి అవతల సందేశాత్మక నాటకం ప్రదర్శింపబడుతుందని; ప్రధాన పాత్రల్లో అనిల్, భార్గవ్, హేమంత్, ఇంద్ర, కిరణ్, పవన్, ప్రశాంత్, శేఖర్, శ్యామ్, శ్రీరామ్, సూర్యచంద్ర, సుశాంత్, సంజయ్ తదితరులు నటిస్తారని కె.వి.రమణాచారి వివరించారు. అధిక సంఖ్యలో ఔత్సాహిక ప్రేక్షకులు, నాటక రంగస్థల అభిమానులు విచ్చేసి నాటకాన్ని ఆసాంతం తిలకించి కళారంగాన్ని, కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

**మెట్టుగూడ శ్రీ ఉమా మహేశ్వర సహిత వేంకటేశ్వర స్వామి శతాబ్ది ఉత్సవాలకు ఆహ్వానం**



ఆలయ శతాబ్ది ఉత్సవాలకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటి ప్రతినిధులు

**తార్నాక, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :**

మెట్టుగూడలోని శ్రీ ఉమా మహేశ్వర సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరు కావాలని కమిటీ వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొనడంతో పాటు, శ్రీ కాలభైరవ స్వామి ప్రణా ప్రతిష్ట, శ్రీ ఆంజనేయ స్వామి, నవగ్రహా పునః ప్రతిష్ట కార్యక్రమాలను ప్రారంభించేందుకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.



ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ గాయత్రి టవర్స్ వ్యాపారులు

## ఆటల్లో గెలుపు ఓటములు సహజం

### -రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**అత్తాపూర్ ఏప్రిల్28,ప్రభాతవార్త :**

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడా స్ఫూర్తితో జర్నలిస్టులు క్రికెట్ ఆడాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. నేడు శివరాంపల్లిలోని విజయానంద్ గార్డెన్ లో జరిగే జర్నలిస్టుల క్రికెట్ మ్యాచ్ సందర్భంగా సోమవారం మైలార్దేవ్ పల్లి లోని ఎమ్మెల్యే నివాసంలో జెర్సీ ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తి కత్తి మీద సాము లాంటిదని అలాంటి వృత్తిలో నిత్యం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న జర్నలిస్టులు ఒకతాటిపై కొచ్చి క్రికెట్ ఆడడం సంతోషం అని ఆయన అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అన్నారు. జర్నలిస్టుల కుటుంబ సభ్యులు కూడా ఈ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. జర్నలిస్టులు భవిష్యత్తులో ఏ కార్యక్రమాన్ని నిర్వహించిన నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ క్రికెట్ జర్నలిస్టు కమిటీ అధ్యక్షుడు పద్మారం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సూర్యకిరణ్, కోశాధికారి అగ్ని వెంకటేష్ మరియు టి వెంకటయ్య, లక్ష్మణ్ బాల మురళీకృష్ణ, సుజీవన్ రెడ్డి, దస్తగిరి, తిరుమలేష్, ప్రశాంత్ రెడ్డి, మధు, నరసింహ, రాము, రవి, శివ చరణ్, మహేందర్,రామకృష్ణ, రాజేష్ గౌడ్, కోట సాయి పాల్గొన్నారు.

## సాలిడ్ వేస్ట్ రీసోర్స్ పార్కును పరిశీలించిన కమిషనర్ శరత్‌చంద్ర



కొత్వాల్‌గూడ డిఆర్‌సిసిలోని సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్కును పరిశీలిస్తున్న బండ్లగూడ కార్పొరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర.

**నార్సింగి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :**

కొత్వాల్‌గూడలోని డిఆర్‌సిసిలో ఉన్న సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రీసోర్స్ పార్కును బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని ప్రజలంతా తడి,పొడి చెత్తను ఇళ్లలోనే వేరు చేసి ఆటోలలో వేయాలని సూచించారు. ఇలా వేరు చేసిన చెత్తను ఆటోలలో తీసుకెళ్లి రీసోర్స్ పార్కులో కంపోస్టు ఎరువును తయారు చేసి, మొక్కలకు వేయడం జరుగుతుందన్నారు. పొడి చెత్తను రీసైక్లింగ్ చేసి, రీ యూస్ చేయాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పరిశుభ్రతను పాటిస్తే 80.శాతం వరకు రోగాలకు దూరం అవుతామన్నారు. రసాయనాలతో పండించిన ధాన్యం కాకుండా, సేంద్రీయ ఎరువులతో పండించిన ధాన్యంను తీసుకోవాలన్నారు. తాజా ఆహార పదార్థాలు, సీజనల్ పళ్లు తీసుకుంటూ ప్రతి రోజు నడక, ఆసనాలు, యోగా, ప్రాణయామం చేస్తే సంపూర్ణ ఆరోగ్యంను పొందుతామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు నరేందర్, రాము సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**కంటోన్మెంట్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మోండా డివిజన్ శివాజీనగర్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో గత వారం రోజుల నుండి జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి జరిగిన పూజల్లో కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొన్నారు. రాత్రి 9:30 గంటలకు స్వామివారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది, బ్యాండ్ బాజాలతో మేల తాళాలతో కోలాటాలతో చాలా కన్నుల పండుగ నిర్వహించారు. శనివారం 10వ రోజు ఉదయం అభిషేకము చక్రస్నానం జరిగాయి. దేశంలో శాంతి భద్రత ఉండాలని దేశ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆ స్వామివారిని ప్రార్థించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

## వీరశైవ లింగాయత్ జంగమ మహేశ్వర వధూవరుల వివాహ పరిచయవేదిక సద్వినియోగం చేసుకోవాలి

**ముషీరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** వీరశైవ లింగాయత్ జంగమ మహేశ్వర వధూవరుల వివాహ పరిచయవేదికను సద్వినియోగం చేసుకోవాలని విశ్వలింగాయత్ మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు వసారం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ మే 4వ తేదీన మలక్‌పేటలోని శుభం ఫంక్షన్‌లో నిర్వహిస్తున్న ఈ వివాహ పరిచయ వేదిక ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. వీరశైవ లింగాయత్ జంగమ మహేశ్వరుల కమ్యూనిటీ లోని డాక్టర్లు, ఇంజనీర్లు, విదేశీ సంబంధాలను అన్వేషించే వారితో సహా అన్ని విద్యార్హతలు ఉన్న వారు తమకు అనుకూలమైన సంబంధం కుదుర్చుకునేందుకు ఇది ఒక మంచి వేదిక అవుతుందని అన్నారు. మొదటి వివాహం వారైనా, రెండవ వివాహం చేసుకునే వారైనా వారి వారి తల్లి తండ్రులతో కలసి ఈ పరిచయ వేదికలో పాల్గొనాలని, వివరాలకు 9246359842 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## బిజెపి బాగ్ అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడిగా నాగరాజు చారి

**ముషీరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ బాగ్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షునిగా నాగరాజు చారిని నియమిస్తున్నట్లు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో దీపక్‌రెడ్డి మాట్లాడుతూ బాగ్ అంబర్‌పేటలో బీజేపీ మరింత బలోపేతం అయ్యేందుకు నాగరాజు చారి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నాగరాజుచారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో డివిజన్ అధ్యక్షునిగా అవకాశం ఇచ్చినందుకు బీజేపీ నాయకులకు ధన్యవాదములు తెలిపారు.

## ఘనంగా సంచారపురి సిల్వర్ జూబ్లీ వేడుకలు



1వ వార్డు సంచారపురి ఫేస్-2 సిల్వర్ జూబ్లీ వేడుకలో ౣ సిఈఓ మధుకర్ నాయక్, బోర్డు మెంబర్ బానుక నర్మధ, జంపన, జె.ఎం. ఆర్. తదితరులు

**కంటోన్మెంట్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** కాలనీల ప్రాంతాల అభివృద్ధికి తమ ఇంటి పనిగా భావించుకుంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు కాలనీలు మరింత అభివృద్ధి చెందుతాయని కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. ఆదివారం కంటోన్మెంట్ 1వ వార్డు బోయిన్‌పల్లి సంచారపురి కాలనీ ఫేస్ -2లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. సంచార పురి కాలనీ 25 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా కాలనీ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ మాట్లాడుతూ ఎంపీ ఈటెల రాజేందర్ కాలనీ అభివృద్ధికి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.25 లక్షలు నిధులు మంజూరైనట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపనప్రతాప్, జక్కుల మహేశ్వర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు కె.వి.స్వామి, ఉపాధ్యక్షులు రఘునాథ్‌గోష్, ప్రధాన కార్యదర్శి ఎస్.నరేందర్ రెడ్డి, కార్యదర్శి బి.రామరాజు, గోశాధికారి టీ.బాల్‌రాజ్, కాలనీ ప్రతినిధులు గోపాల క్రిష్ణ, జితేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, సుభానిషేక్, ఉన్నిక్రిష్ణ, సురేశ్ అగర్వాల్, వెంకటేశ్వర్ రావ్, విద్యా సాగర్, చంద్రశేఖర్ యాదవ్, నాయకులు సామల రాఘవరెడ్డి, బాణాల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దు : ఎమ్మెల్యే తలసాని



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**కంటోన్మెంట్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** ఆర్థిక సమస్యలతో ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం మారేడ్‌పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన సిఎంఆర్. ఎఫ్ చెకు ౹లను, ఎల్‌ఓసీ పత్రాలను తలసాని చేతుల మీదుగా అందజే శారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, బిఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, హన్మంత్ రావ్, అశోక్ యాదవ్, ఖలీల్, బల్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి :పెద్దాల



5వ వార్డులో ఎల్‌ఓసి పత్రాన్ని అందజేస్తున్న పెద్దాల నరి ్సంహ్మా తదితరులు

**కంటోన్మెంట్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమం కోసం సిఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని 5వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నేత పెద్దాల నరి ్సంహ్మా తెలిపారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సహకారంతో సెకండ్ లక్ష్మి నగర్‌కు చెందిన బాలక్రిష్ణ వైద్య పరీక్షల నిమిత్తం మంజూరైన 3 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని సోమవారం పెద్దాల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాధవ్, లక్ష్మణ్ యాదవ్, యాదగిరి, నర్సింగ్ రావ్, దశరత్, రమేశ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు ఫ్లాట్లు కేటాయిస్తాం : ఆర్‌డిఓ సాయిరామ్

**-నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించుకున్న ఫ్లాట్లను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు**

**కంటోన్మెంట్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గ ్ం మోండా డివిజన్‌లోని ఓల్డ్ మారేడ్‌పల్లిలో 80 యేండ్ల నుంచి నివాసం ఉంటున్న స్థానిక లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో స్థానికంగా నివాసం ఉంటున్న లబ్ధిదారులకు 15 రోజుల్లో ఫ్లాట్లను అలాట్ చేస్తామని సికింద్రాబాద్ ఆర్‌డిఓ సాయిరామ్ తెలిపారు. ఓల్డ్ మారేడ్‌పల్లిలో నివాసం ఉంటున్న లబ్ధిదారులకు 468 ఫ్లాట్లను నిర్మించింది. అందులో మొదటి విడతలో 2022 మొదటి విడతలో 273 మందికి ఫ్లాట్లను అలాట్ చేశారు. మిగిలిన 211 ఫ్లాట్లను 2వ విడతలో అలాట్ చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేశారు. దీంతో అద్దెలు చెల్లించలేక ఆందోళనకు గురైన 49 మంది లబ్ధిదారులు అక్రమంగా డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను ఆక్రమించుకొని నివాసం ఉంటున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు సోమవారం బారీ పోలీస్ బలగాలను మోహరించి రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఫ్లాట్లల్లో చేరిన వారిని ఖాళీ చేయించి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడతూ 15 రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను అలాట్ చేస్తామన్నారు.



మారేడ్‌పల్లి 2 బిహెచ్‌కె వద్ద మీడియాతో మాట్లాడుతున్న సికింద్రాబాద్ ఆర్‌డిఓ సాయిరామ్

**అక్రమంగా ఫ్లాట్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవు : డిసిపి రష్మిపెరుమాల్**

ఓల్డ్ మారేడ్‌పల్లిలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లల్లో నిబంధనలకు విరుద్ధంగా ఫ్లాట్లల్లో చేరిన వారిపై, ఖాళీ ఫ్లాట్లకు తాళం వేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఉత్తర మండలం డిసిపి సాధన రష్మిపెరుమాల్ తెలిపారు. రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేస్తే ఆక్రమణ దారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు బీమయ్య గౌడ్, పాండు నాయక్, రాణా ప్రతాప్ సింగ్ హారిక తదితరులు పాల్గొన్నారు.

## మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిసిన మస్తాన్‌రెడ్డి

**యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 28, ప్రభాతర్త :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేద వాడికి అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం అల్లాపూర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేవరింటి మస్తాన్‌రెడ్డి మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని సన్న బియ్యం పథకం చరిత్రలో మిగిలిపోతుందన్నారు. ప్రజలకిచ్చిన గ్యారంటీలు ఎప్పటికప్పుడు అమలు పర్చటంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఉంటుందని రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలను తీసుకురావాలని కోరారు. తమ వంతుగా కార్యకర్తలం పార్టీ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ప్రజల్లో ఉంటూ పార్టీ కోసం పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు చోటామోయిద్, జావేద్ అలీ, ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాం మృతులకు ఘన నివాళి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్టీఆర్ నగర్ సంక్షేమ సంఘం సభ్యులు

**నిజాంపేట్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ఎన్టీఆర్ నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన 28 మంది ఆత్మ శాంతి కొరకు కొవ్వొత్తులతో 191, శ్రీనివాస నగర్ కాలనిలలో సోమవారం పాదయాత్రగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ శాంతి ర్యాలీలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో ఎన్ఎంసి మాజీ కార్పొరేటర్, నిజాంపేట మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ నాయకులు ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, ఏనుగుల శ్రీకాంత్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్ముకశ్మీర్ పహల్గాం, బైసాన్ సమీపంలో పర్యాటకులపై ఉగ్రదాడి పిరికి చర్య అని అన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు వారు ప్రగాఢ సానూభూతి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో శ్రీహర్ష ఆమంచి, అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డిపల్లి సుధాకర్, బూసాల ఉదయ్ కుమార్, బైపునేని మోహన్, ప్రవీణ్ చారి, మధుసూదన్ రెడ్డి, రవీందర్ యాదవ్, యువకిరణ్, నాగిరెడ్డి, కాంత రెడ్డి, నరసింహ, ఉపేందర్, ప్రభాకర్, ప్రశాంత్, అశోక్ రెడ్డి మాదారు, డి.మంజునాథ్, వినయ్, జగన్, ప్రేమ్ కుమార్ ఎన్టీఆర్ నగర్ కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పహల్గాం ఘాతుకాన్ని నిరసిస్తూ ర్యాలీ




కాశ్మీర్ లోని పహల్గాం ఘాతుకాన్ని నిరసిస్తూ త్యాగరాయ గానసభ వద్ద జాతీయ జెండాలతో సంఘీభావ ర్యాలీ నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** కాశ్మీర్ లోని పహల్గాం ఘాతుకాన్ని నిరసిస్తూ మృతులకు సంతాపాన్ని, మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేస్తూ సోమవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ఆవరణలో గానసభ, ఆనందలహరి సాంస్కృతిక సంస్థ, వందేభారత్ సేవ్ ఇండియా మూవీ చిత్ర యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారగ్రహీత చొక్కాపువెంకటరమణ, వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, కళారత్న మల్లం రమేశ్, ప్రముఖ మెజిషియన్ రామదుగు వసంత్, ప్రముఖ మిమిక్రి కళాకారుడు భవిరి రవి తదితరులు పాల్గొన్నారు. దేశ రక్షణకు మద్దతును తెలిపేందుకు ప్రతి ఒక్కరు కేంద్రానికి అండగా ఉండాలన్నారు.

## ఉస్మానియా మెడికల్ కాలేజీ నూతన ప్రిన్సిపల్ డాక్టర్ రాజారామ్ కు ఘన సన్మానం

**మెహిదీపట్నం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ గా ప్రొఫెసర్ డాక్టర్ రాజారామ్ నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో సోమవారం నీలోఫర్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోవిడ్ టైం లో గాంధీ హాస్పిటల్ సూపరిండెంట్ గా సేవలు అందించిన డాక్టర్ రాజారామ్ కు ప్రభుత్వం బెస్ట్ డాక్టర్ అవార్డు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఉస్మానియా మెడికల్ కాలేజీలో కూడా అదే తరహాలో సేవలు అందించాలని ఆకాంక్షించారు. పుష్పగుచ్ఛం అందించిన వారిలో నీలోఫర్ హాస్పిటల్ పీడియాట్రిక్ హెచ్ ఓ డి డాక్టర్ విజయ కుమార్, డాక్టర్ మాధురి, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ లు ఉన్నారు.



ప్రొఫెసర్ డాక్టర్ రాజారామ్ కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నిలోఫర్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ రవి కుమార్.

## దేవాలయాల అభివృద్ధికి పాటు పడుతున్న ప్రభుత్వం



కార్యక్రమంలో పాల్గొన్న చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జి బోయ నరేష్, దేవాలయం కమిటి ప్రతినిధులు, సభ్యులు

**చార్మినార్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** పాతబస్తీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న దేవాలయ చైర్మన్లతో పాటు పాలక మండలి సభ్యులతో కలిసి ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేవాలయాల అభివృద్ధి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు గురించి తెలుసు కోవటం జరిగిందని చాంద్రాయణగుట్ట నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్ అన్నారు. దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయాల కమిటీల చైర్మన్లు, పాలక మండలి సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పాతబస్తీ అభివృద్ధి కోసం కృషి

**-ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ అఫెంది**



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ అఫెంది

**చార్మినార్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** పాతనగరం అభివృద్ధి కోసం అన్ని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ అఫెంది అన్నారు. మజ్లిస్ పార్టీ తరుపున రెండవ సారి ఎమ్మెల్సీగా ఎన్నికైన రియాజుల్ హసన్ అఫెందీని పాతబస్తీ డాన్ విద్యా సంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రెహ్మాన్ ఖుర్రంతో పాటు పలువురు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు అన్ని రంగాలలోను విపరీతమైన పోటీ పెరిగిందని, విద్యార్థులు కష్టపడి చదివితే తప్పకుండ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో షజీవుల్లా ఫిరాసత్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ఎంపికైన మణికొండ బాల్ బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం



మణికొండ బాల్ బ్యాట్మెంటిన్ నూతన అసోయేషన్ ప్రతినిధుల బృందం.

**నార్సింగి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** మణికొండ బాల్ బ్యాట్మెంటిన్ నూతన అసోసియేషన్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు గ్రేటర్ అల్కాపూర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎన్నికల అధికారిగా, సుమనలిని ఉప ఎన్నికల అధికారిణిగా వ్యవహరించారు. 18.మంది సభ్యులలో 15.మంది సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని రామ్మోహన్ రావ్‌ను అధ్యక్షుడిగా, నరహరి శాస్త్రిని ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు ముఖ్య కార్యదర్శిగా, రమేష్ ఉప కార్యదర్శిగా, హరినాథ్‌రెడ్డి కోశాధికారిగా, కోదండ రామిరెడ్డి, శ్రీనివాస్‌రావులు కమిటీ సభ్యులుగా దరఖాస్తు చేసుకున్నారు. వీరికి పోటీగా ఎవరూ నిలువకపోవడంతో వీరందరిని ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అలాగే మాజీ కౌన్సిలర్ ఆలస్యం నవీన్ కుమార్‌ను చీఫ్ పాట్రాన్‌గా, ముఖ్య సలహాదారుగా అందే లక్ష్మణ్‌రావ్‌లను ఎంపిక చేసుకున్నారు. నూతన కమిటీ సభ్యుల బృందంకు గ్రేటర్ అల్కాపూర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం ఉపాధ్యక్షులు, కోశాధికారులు అభినందనలు తెలియజేశారు. అధ్యక్షులు రామ్మోహన్‌రావ్ గత నెలలో నేపాల్‌లో జరిగిన క్రీడా పోటీలలో పాల్గొని 6.బంగారు పతకాలు సాధించి మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. ఆదివారం స్టేట్‌మీట్‌లో మాస్టర్ ఫోర్ విభాగం నందు పాల్గొని రెండు బంగారు పతకాలు సాధించారు. రామ్మోహన్‌రావ్‌కు నూతన కార్యవర్గం సభ్యులు, అల్కాపూరి కాలని సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె" సన్నాహాలు



జిహెచ్‌ఎంసి ఉద్యోగ, కార్మిక సంఘాల జేపీసీ సమావేశంలో పాల్గొన్న ఎంకె.బోస్, వెంకటేశ్ తదితరులు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకొనేందుకు కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె" చేయాలని నిర్ణయించాయని టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.బోస్ అన్నారు. సోమవారం జిహెచ్‌ఎంసి ఉద్యోగ, కార్మిక సంఘాల జేపీసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎం.కె.బోస్ మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తున్నదని, . కార్మికవర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాలలో సాధించుకొన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లను ముందుకు తెచ్చింది. వీటికి వ్యతిరేకంగా గత ఐదేళ్ళుగా కార్మికవర్గం చేస్తున్న ఆందోళనా, పోరాటాలతో లేబర్ కోడ్ అమలు 5 సంవత్సరాలు ఆలస్యమైనా, ఇప్పుడు వాటిని అమలు చేసి కార్మిక హక్కులను పూర్తిగా హరించే ప్రయత్నం చేస్తున్నది. 2025-26 బడ్జెట్లో తమ కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుగుణంగా కేటాయింపులు చేసింది. సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టింది. సామాన్యులపై భారాలు మోపి, కార్పొరేట్ గుత్త సంస్థలకు, పెట్టుబడిదారులకు వేల కోట్ల రాయితీలు ప్రకటించిందన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ మాట్లాడుతూ ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోకపోగా, ఈ సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చే ఆర్థిక విధానాలను విచక్షణారహితంగా అమలు చేస్తున్నదన్నారు. . కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షి ంచుకొనేందుకు కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె" చేయాలని నిర్ణయించాయి. ఈ సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా సంపూర్ణ మద్దతును ప్రకటించింది. సమ్మె రోజున గ్రామీణ బందుకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మే 20న జరిగే సమ్మెకు సమాయత్తం కావాలని, సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు, ప్రభుత్వరంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులందరూ ఈ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా మే 2న జిహెచ్‌ఎంసి కార్మిక సంఘాల జాయింట్ సమ్మె నోటీస్ ను జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు అందించాలని, మే 5 నుండి 10 వరకు హాజరు పాయింట్ల వద్ద (భోజన విరామ సమయంలో) నిరసనలు, మే 11 నుండి 15 వరకు జిహెచ్‌ఎంసి 30 సర్కిల్స్‌లో కార్మిక సంఘాల జీపు యాత్ర నిర్వహించాలని, మే 16 నుండి 18 వరకు డిమాండ్ బ్యాడ్జీలు, నల్ల బ్యాడ్జీలు పెట్టుకోవాలని, కరపత్రాలు పంచాలని, మే 19 సమ్మె సన్నాహాలు చేయాలని, మే 20 సమ్మెలో జిహెచ్‌ఎంసి మొత్తం కార్మికులు సమ్మె చేసి, ఇందిరా పార్కు వద్ద ఉదయం 11 గంటలకు జరిగే బహిరంగ సభలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో ఏఐటియుసి నేత ఏసురత్నం, ఐఎఫ్‌టియు నుంచి శివబాబు, బిఆర్‌టియు నుంచి కురుమయ్య, మంగపతి, అంజయ్య, మద్దిలేటి, అంజద్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక దృఢత్వం పెరుగుతుంది : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**జీడిమెట్ల, ఏప్రిల్ 28, ప్రభాతవార్త** క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. సోమవారం 130 సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్. నాయక్ నందు సుమారు 2.90 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇండోర్ షటిల్ కోర్ట్స్ క్రీడా ప్రాంగణాన్ని బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా క్రీడల్లో ప్రోత్సహించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో షటిల్ కోర్ట్స్ క్రీడా ప్రాంగణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ నగర్ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీ నారాయణ, శేషా చారి, దుర్గా రావు, భాస్కర్ రెడ్డి, హరిబాబు యాదవ్, నర్సింగ్ రావు, శ్యామ్, గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర రావు, పద్మ, అనిల్, శ్రీదేవి, సరిత, ఉమా, స్వర్ణ, ఎస్.ఆర్.నాయక్ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీనివా స్, కార్యవర్గ సభ్యులు సదానంద చారి, ప్రభాకర్, జనప్రియ భాస్కర్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇండోర్ షటిల్ కోర్ట్స్ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

## అన్ని డిపోలలో జెఎసి కమిటీలు వేయండి

**చిక్కడపల్లి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అని ఆర్టీసి డిపోలలో జేఏసీ కమిటీలు వేయాలని టిజిఎస్ ఆర్‌టిసి జేఏసీ కో చైర్మన్ హనుమంతు ముదిరాజ్ పిలుపునిచ్చారు. టిజిఎస్ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీన డేట్ ఆఫ్ అపాయింట్ మెంట్, రెండు 2021,2025వేతన సవరణలు, 2017 వేతనసవర బకాయిలు, కారుణ్య నియామకాలలో రెగ్యులర్ ప్రాతిపదికన జేతలివ్వాలని ,యూనియన్ల అనుమతి ,పెంచిన పనిభారం తగ్గించుటకు ,యాజమాన్యం వేదింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రైవేట్ బస్సుల డ్రైవర్లను ఆర్టీసి ఉద్యోగులుగా తీసుకోవాలని, రిటైర్డ్ ఉద్యోగులకు రావల్సిన బకాయిలు ఇవ్వాలని ఇతర సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 7వ తేదీ నుండి సమ్మెలోకి వెళ్లుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో అన్ని యూనియన్లతో కలిపి ఉద్యోగులు వెంటనే జేఏసీ కమిటీలు వేయాలని కోరారు.




## ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**చిక్కడపల్లి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** ప్రజాసేవ లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేందుకు కేంద్ర మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. నేషనల్ యూనియన్ ఆఫ్ ఆర్ఎంఎస్, ఎంఎంఎస్ ఎంప్లాయీస్ గ్రూప్‌సీ, మెయిల్‌గార్డ్ , ఎం టి ఎస్ తెలంగాణ సర్కిల్‌జాయింట్ ద్వైవార్షిక 4వ సర్కిల్ సదస్సు బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం మెడలు ఉంచైనా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటామని ఆయన చెప్పారు. ఆర్ ఎం ఎస్, ఎంఎంఎస్ ఉద్యోగులకు తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు కార్మిక చట్టాలు కార్మికుల హక్కులు కల రాసే విధంగా ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఒకటొకటిగా ప్రవేట్ పరం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని మండిపడ్డారు. ఈ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మీ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామ ని ఆయన హామీ ఇచ్చారు. ఉద్యోగులు తీసుకుని ఆందోళన కార్యక్రమంలో పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఎఫ్ ఎన్ పి ఓ. సెక్రటరీ జనరల్‌వాసిరెడ్డి శివాజీ, ఆర్. మురళి, యూనియన్ తెలంగాణ సర్కిల్ చీఫ్ సెక్రటరీ పాండు, కృష్ణ, ఐ ఎన్ టి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగయ్య గౌడ్, ముఖ్య నాయకులు రఘునాథ్ స్వామి, విద్యాసాగర్


**వార్త CLASSIFIEDS**

**LOSS OF PASSPORT**

★ I, Allamudi Abhijit S/o. Allamudi Venkata Subba Rao R/o. H.No. 1-3-183/40/13, SBI Staff Cly, New Bakaram, Gandhinagar, Hyd. T.S. While I am shifting My House I Lost My Original Passport Bearing No: M9921033. If Anyone Found Cont: 9966156936.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన

నిట్ నెం. 01/EE-Div.29/SBZ/GHMC/2025-26 తేది: 28.04.2025
పనిపేరు : 1) ZC కార్యాలయ భవనం యొక్క AMC 2) ZC కార్యాలయ భవనం వద్ద అగ్నిమాపక భద్రతా సిటీ హోస్ పైప్ పరికరాల మరమ్మతు. 3) GHMC, సికింద్రాబాద్, సర్కిల్-29లో సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌కు పెయింటింగ్ మరమ్మతులు. అంచనా మొత్తం/ECV లక్షలలో: 42.90. బిడ్ల స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 30.04.2025 సా.4.00గం. నుండి 06.05.2025 సా.4.00గం.వరకు. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, GHMC, సికింద్రాబాద్, సెల్ నం: 7995468066. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, సికింద్రాబాద్, GHMC.
DIPR.NO.952-PP/CL/ADVT/1/2025-26 తేది: 28.04.2025

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-2, 1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD**

**OA NO 201 OF 2025**

Between:
UNION BANK OF INDIA ....APPLICANTS
AND
SATE VENKATA SRINIVAS ....DEFENDANTS
To,
1. SATE VENKATA SRINIVAS
S/o Sate Durgaiahaged 50 yrs, Residing atH No: 5-211/A, Gandhi Street, Medchal Village Medchal Mandal Medchal-Mlkajgiri District
ALSO AT
SATE VENKATA SRINIVAS Plot NO: 2 Survey No: 1047 Block No: 5 Bank Colony Medchal - Medchal Mandal, Medchal-Mlkajgiri District
2. SMT.SATE SANTOSHA LAXMI
S/o Sate Venkat Srinivas aged 43 yrs Residing at H No:5-211/A, Gandhi Street, Medchal Village Medchal Mandal Medchal-Mlkajgiri District
ALSO AT
SMT.SATE SANTOSHA LAXMI Plot NO: 2 Survey No: 1047, Block No. 5 Bank Colony Medchal - Medchal Mandal Medchal-Mlkajgiri District

**SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEF PRAYED SHOULD NOT BE GRANTED**

Whereas the applicant bank has instituted an application under Section 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act, 1993 against you for recovery of RS. 52,65207.36 ps together with current and future interest and other reliefs and the same posted to 11.06.2025 at 10.30 a.m. for your appearance. You are hereby required to show cause within 30 days from the date of summons or on the date and time mentioned above either in person or by Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default, the application will be heard and determined in your absence
Given under my hand and the seal of this Tribunal on this 25TH day of APRIL- 2025.

Registrar
Debts Recovery Tribunal-2
Hyderabad.

**PUBLIC NOTICE**

As per my client instructions **Mr. Paluri Suresh,** resident of Tirumalagiri, Secunderabad, it is hereby informed to general public that my client is having bank account bearing No. **991500360004433** in Telangana State Co-operative Apex Bank Ltd, Lothkunta Branch, Secunderabad.
My client has lost the following number cheques in the office and not traced out so far, related to above bank a/c:
**1. Cheque No: 056778**
**2. Cheque No: 056779**
**3. Cheque No: 056780**
**4. Cheque No: 094335**
**5. Cheque No: 094334**
**6. Cheque No: 094333**
The public is requested to hand over the same if anybody found, in case if anybody misused the above cheques, criminal action will be initiated against the persons.
Sd/- T V S. Prakasha Rao
Advocate
Hyderabad, T.S.
Mb: 9885366962

## అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు.

**హయత్‌నగర్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**
ఈనెల 26న కుంట్లూరు గ్రామం రావినారాయణ రెడ్డి కాలనీ ఫేస్ 3లో ఆకస్మికంగా మంటలు చెలరేగి గుడిసెలు కాలిపోవడంతో సర్వం కోల్పోయిన భాదితులను ఆదు కోవాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి కి వినతిపత్రం అందించారు. ఈ సందర్బంగా పార్టీ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు రవీంద్ర చారీ, నాయకులు యాదిరెడ్డి మాట్లాడుతూ... అగ్ని ప్రమాదంలో 200కి పైగా గుడిసెలు కాలి బూడిద అయ్యాయని, మరికొన్ని పాక్షికంగా కలాయాన్నారు. గుడిసెవాసులు కూలీ పనులకు వెళ్ళటంతో సర్వం కోల్పోయారన్నారు. వారికి లక్ష రూపాయల పరిహారం, నివాస యోగ్యత కోసం విద్యుత్ మరియు మంచి నీటి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ని కోరారు. దానికి ఆయన సానుకూలంగా మాట్లాడినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సామిడి శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, అజ్మీర్ హరి సింగ్ నాయక్, మరియు కేతరాజు నర్సింహా, పొన్నాల యాదగిరి, అరుణ, నవనిత పాల్గొన్నారు.

## పీర్జాదిగూడ ఏడో డివిజన్లో సిసి రోడ్లు శంకుస్థాపన



పిర్జాదిగూడ ఏడో డివిజన్లో సిసి రోడ్లో శంకుస్థాపన చేస్తున్న మాజీ మేయర్ అమర్ సింగ్, మాద్గుల చంద్రారెడ్డి తదితరులు

**మేడిపల్లి , ఏప్రిల్28 ప్రభాతవార్త ;**
పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని 7వ డివిజన్‌లో సిసి రోడ్ల అభివృద్ధి పనుల కార్యక్రమం నిర్వహించారు . కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాడుగుల చంద్రారెడ్డి ఆధ్వర్యం లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ అమర్ సింగ్,మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ... సిసి రోడ్ల నిర్మాణం ద్వారా స్థానికులకు రాకపోకలు సులభతరం అవుతాయని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్ , మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాడుగుల చంద్రారెడ్డి , మోహన్ కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారాన్ని కృషి: ఎమ్మెల్యే బలాల



ఓల్డ్ మలక్ పేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల , చిత్రంలో సైఫుద్దీన్ షఫీ, డిజిఎం హస్మత్ అలీ తదితరులు

**మలక్ పేట ,ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ లోని అయోధ్య నగర్ లో డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు సైఫుద్దీన్ షఫీ, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే అహ్మద్ బలాల పర్యటించి స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ స్థానిక ప్రజలు పేర్కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసం ప్రతినిత్యం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో పర్యటించి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం హస్మత్ అలీ, పలువురు అధికారులు, సిబ్బంది ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెంగిచెర్లలో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



బోడుప్పల్ చెంగిచెర్ల ఫ్రీ విలేజ్‌లో శంకుస్థాపన చేస్తున్న కొత్త కిషోర్ గౌడ్ ,చీరాల నరసింహ, కుర్రి శివశంకర్ తదితరులు

**బోడుప్పల్ , ఏప్రిల్ 28 ప్రభాతవార్త;**
బోడుప్పల్ ఒకటో డివిజన్ ఫ్రీ విలేజ్ చెంగిచెర్లలో సీసీ రోడ్ల శంకుస్థాపన జరిగింది. ఈ నిధులు బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని మాజీ కార్పొరేటర్ చీరాల నరసింహ నిధులతో శంకుస్థాపన జరిగింది .ముఖ్య అతిథులు మేడ్చల్ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ , ఒకటో డివిజన్ ఇంచార్జ్ కుర్రి శివశంకర్ శంకుస్థాపన చేశారు .ఈ కార్యక్రమంలో మేడ్చల్ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ , మాజీ కార్పొరేటర్ చీరాల నరసింహ ,ఒకటో డివిజన్ ఇంచార్జ్ కుర్రి శివశంకర్ , ఫ్రీ విలేజ్ ఎస్టేట్ కాలనీ అధ్యక్షులు జయేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజయ్య కాలనీవాసులు ఈశ్వర్ రెడ్డి వేణుగోపాల్ ,సోమేశ్ దాక్రే , ఉపేందర్ , శేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. మాజీ కార్పొరేటర్ చీరాల నరసింహకు కృతజ్ఞతలు తెలియజేశారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీ గాయత్రీ స్కూల్ విద్యార్థులు

## ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణమే చర్యలు : జోనల్ కమిషనర్ వెంకన్న

**మలక్ పేట ,ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**
ప్రజావాణి కార్యక్రమం లో అందిన ఫిర్యాధులను పరిశీలించి తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జీ హెచ్ యం సీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చాంద్రాయణ గుట్ట సర్కిల్ కు చెందిన పారిశుధ్య నిర్వహణ సిబ్బంది , ఇంజనీరింగ్ సమస్యల గురించి 02, చార్మినార్ సర్కిల్ కి చెందిన అక్రమ నిర్మాణం పై 01, ఫలక్ నుమా సర్కిల్ పరిధిలోని వీధి దీపాల సమస్యపై 01. ... మొత్తం 04 ఫిర్యాదులు అందయి. ఈ సందర్బంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు . స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ మురుగునీటి సమస్య, రోడ్లు, వీధి దీపాలు ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. తమ




ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలను తెలుసుకుంటున్న జోనల్ కమిషనర్ వెంకన్న తదితరులు

దృష్టికి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి అవసమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు . ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్, టౌన్ ప్లానింగ్ సీటి ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్ , వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ఏ యం సీ రాజారావు, మలేరియా సీనియర్ ఎంటామాలజిస్ట్ నామాల శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఈ ఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్గిరిలోని ఇందిరా మహిళా భవన్‌లో లైబ్రరీ పెట్టాలి

**నేరెడ్ మెట్, ఏప్రిల్ 28,ప్రభాతవార్త :**
మల్కాజ్గిరి చౌరస్తా లో ఉన్న ఇందిరా మహిళా భవన్ లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ రాజుకు స్థానిక కార్పొరేటర్ శ్రావణ్ కాలని వాసులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత 3 సంవత్సరాలుగా ఇందిరా మహిళా భవన్ లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయమని కోరుతున్నపటికి, ప్రజల వద్ద లైబ్రరీ సెస్ వసూలు చేస్తున్నప్పటికి లైబ్రరీ ని పట్టించుకోకపోవడం శోచనీయం అన్నారు.లైబ్రరీ తో పాటు స్టడీ రూమ్ ఏర్పాటు చేయ్యడం వద్ద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.అదే విధంగా మల్కాజ్గిరి పి. హెచ్. సి ఎక్కడో నేరెడ్మేట్ లో ఉండటం వల్ల మల్కాజ్గిరి ప్రజలు నష్టపోతున్నారని, వెంటనే మల్కాజ్గిరి డివిజన్ పరిధిలో ఒక భవనాన్ని పి. హెచ్. సి కు కేటాయించాలని డిమాండ్ చేసారు.మహిళలకు, దివ్యంగులకు, బ్రాహ్మనులకు, నాయి బ్రాహ్మణులకు, స్ట్రీట్ లైట్ సిబ్బందికి, ఎంతోమలజీ వారికి



భవనాలు కేటాయించాలని కోరారు.అదే విధంగా హార్టికల్చర్ విభాగం పని తీరు అద్వానంగా ఉందని, గ్రీన్ వేస్ట్ ను ఎత్తడం లేదని, పార్కులలో ఆట వస్తువులు నాసి రకంగా ఉన్నాయని అన్నారు. వెంటనే నాణ్యమైన వస్తువులతో వాటిని రీప్లేస్ చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమం లో బక్క నాగరాజ్, సునీల్ యాదవ్, సోమా శ్రీనివాస్, జై కృష్ణ, రవి, నందు యాదవ్, మురళి గౌడ్, జె. వెంకటేష్, ప్రభు గుప్త, వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాం ఉగ్రదాడి హేయమైన చర్య : పార్లమెంటు సభ్యురాలు డి.కె.అరుణ

**సైదాబాద్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**
పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమైన చర్య అని మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె. అరుణ అన్నారు. ఎల్బినగర్ బైరామల్‌గూడలోని అవేర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ అండ్ ఎంఎల్‌టిలో ఆదివారం నిర్వహించిన కాన్వకేషన్ సెరమని కార్యక్రమానికి అవేర్ గ్రూప్స్ ఫౌండర్ చైర్మన్ మాధవన్‌జితో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి డి.కె.అరుణ మాట్లాడుతూ టూరిస్టులపై దాడి చేసిన ఉగ్రమూకలకు కేంద్ర ప్రభుత్వం తప్పకుండా తగిన రీతిలో గుణపాఠం చెబుతుందన్నారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత విషయంలో అవేర్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు సహాయ మందించడంలో అవేర్ ముందుదన్నారు. నర్సింగ్ అనేది ఛాలెంజింగ్ వృత్తి అని, వైద్య సేవలతో పాటు రోగుల మన్ననలు పొందాల్సి ఉంటుందన్నారు. అవేర్ గ్రూప్స్ చైర్మన్ మాధవన్‌జి మాట్లాడుతూ నేటి యువతలో దేశభక్తి భావన, చైతన్యం మరింత పెంపొందాల్సి ఉందన్నారు. ఉగ్రవాదుల పాశవిక దాడి గురించి దేశవ్యాప్తంగా విద్యార్థులు ఖండించా




విద్యార్థినులకు కాన్వకేషన్ పట్టాలు అందజేస్తున్న ఎంపి డి.కె.అరుణ

ని, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా విద్యార్థులు గొంతెత్తాల్సిన అవసరముందన్నారు. నర్సింగ్, ఎంఎల్‌టి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ముఖ్య అతిథి డి.కె.అరుణ చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు వదిలిన వారి ఆత్మకు శాంతి కలగాలని కార్యక్రమ ప్రారంభానికి ముందు కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అవేర్ గ్రూప్ డైరెక్టర్ జనరల్ వి.రాజవర్ధన్‌రెడ్డి, జాతీయ బిసి కమీషన్ మాజీ సభ్యుడు ఆచారి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పార్వతి పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ కార్పొరేషన్ 26వ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**
మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గుర్రంగూడ-అల్మాస్‌గూడకు సంబంధించిన 26 డివిజన్ కిందకు వచ్చే సర్వే నెంబర్ 93, 94లలో అక్రమ నిర్మాణాలు చేస్తున్న బిల్డర్లపై అదే విధంగా ప్రభుత్వాదాయానికి గండికొడుతూ అక్రమ నిర్మాణదారులను ప్రోత్సహిస్తున్న మున్సిపల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానిక డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ జక్కిడి మంజుల జంగారెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు ఆమె సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, కార్పొరేషన్ కమీషనర్‌లకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 26వ డివిజన్ పరిధిలోని అల్మాస్‌గూడ, గుర్రంగూడల్లో విచ్చలవిడిగా బిల్డర్లు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని ఆమె తెలిపారు. పర్మిషన్ ప్రకారం కాకుండా నిబంధలను విరుద్ధంగా ఎలాంటి సెట్ బ్యాక్‌లు వదలకుండా యధేచ్ఛగా నిర్మాణాలు జరుపుతున్నారని ఆమె పేర్కొన్నారు. స్థానిక తిరుమలనగర్, న్యూ తిరుమలనగర్, మధురానగర్, శ్రీహిల్స్ కాలనీ, శ్రీశ్రీ హోమ్స్, వెంకటేశ్వరకాలనీ, మల్లారెడ్డి కాలనీ, గడ్డం ఎన్‌క్లేవ్ ఫేస్-1, 2, 3 కాలనీలు, టెలికాం కాలనీ, పోస్టల్ కాలనీల్లో ప్రభుత్వాదాయానికి గండికొట్టే విధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆమె వివరించారు. బిల్డర్లతో కుమ్ముక్కైన మున్సిపల్ సిబ్బంది లక్షలా



బడంగ్‌పేట్ కమీషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జక్కిడి జంగారెడ్డి

ది రూపాయలు దండుకొని నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలను చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారని ఆమె ఆరోపించారు. తూతూ మంత్రంగా కొందరికి నోటీసులు ఇచ్చి అక్రమ నిర్మాణాలకు ఎలాంటి నష్టం కలగకుండా సిబ్బందే చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విచారణ జరిపి డివిజన్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ కట్టడాలపై మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అదే విధంగా సదరు బిల్డర్లు, వారిని ప్రోత్సహిస్తున్న కార్పొరేషన్ సిబ్బందిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంజుల జంగారెడ్డి జిల్లా కలెక్టర్, బడంగ్‌పేట్ స్పెషలాఫీసర్, కమీషనర్లను కోరారు.

## కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం : పరమేశ్వర్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న రామంతాపూర్ నేతలు

**ఉప్పల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి పలువురు పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నేతాజీనగర్‌లో డివిజన్ వర్కింగ్ ప్రసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తుందని, సిఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు ప్రతి ఒక్కరికి చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి తగు గుర్తింపు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా బల్లెం గౌతమ్, కిరణ్, సాయి, కిషోర్, విజయ్, శరత్,అశ్విన్, రూపేష్, వినయ్, చింటూ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ కుమార్, కోఆర్డినేటర్ లింగంపల్లి రామకృష్ణ, ఉపేందర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, గరిక సుధాకర్, సందీప్, జి.స్వామి, కె.స్వామి, కాయ ఉపేందర్, నయిమ్, బెజ్జం యాదగిరి, అనిల్, అశోక్, సచిన్, భూరన్, జిల్లు, భాస్కర్, నామ్ రాజిరెడ్డి, అరుణ్‌సాయి, వినయ్‌గౌడ్, ముత్యాల బాబు, నాగ మల్లయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాపలాదారులపై కత్తులతో దాడి చేసి -గొర్రెలను ఎత్తుకెళ్లిన దుండగులు

**హయత్ నగర్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**
గొర్రెలను దొంగిలించడానికి వచ్చిన గుర్తు తెలియని దుండగులు కాపలా ఉన్న యువకులపై కత్తులతో దాడిచేసి గొర్రెలను ఎత్తుకు పోయిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు... అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడ గ్రామానికి చెందిన రాసూరి శ్రీశైలం గొర్రెలను మేపుతూ జీవ్నన సాగిస్తుంటాడు. అతను అనారోగ్యం పాలవడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రి లో చేరాడు. దీంతో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న శ్రీశైలం కుమారుడు నవీన్, అతని బావమరిది శ్రీకాంత్ లు ఆదివారం రాత్రి 8 గంటలకు భోజనం ముగించుకుని గొర్రెల మంద వద్దకు చేరుకున్నారు. వారు నిద్ర పోయాక సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు 89 మంది మంద వద్దకు వచ్చి నవీన్, శ్రీకాంత్ సెల్ ఫోన్ లను లాక్కున్నారు. అలికిడికి నిద్ర లేచిన వారిపై దుండగులు కత్తు లతో దాడిచేసారు. ఈ సంఘటనలో నవీన్, శ్రీకాంత్ ఇరువురికి గాయ్యాలయ్యాయి. అనంతరం దుండగులు వారి వద్ద నుండి 5 వేల రూపాయల నగదుతో పాటు మంద లోని 2025 గొర్రెలను ఎత్తుకుని బొలెరో వాహనంలో పరారయ్యారు. దాడి చేసిన వ్యక్తులు హిందీ భాషలో మాట్లాడినట్లు బాధితులు తెలిపారు. అనంతరం వారు గ్రామస్తుల సహాయంతో డయల్ 100 కు ఫోన్ చేయగా.... హయత్ నగర్ పోలీసులు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని నవీన్, శ్రీకాంత్ లను చికిత్స కోసం ఎల్బీనగర్లోని కామినేని ఆసుపత్రిలో తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ,పోలీసులు తెలిపారు. నేరస్తులకోసం గాలిస్తున్నామని, సీసీ కెమెరాల సహకారంతో నేరస్తులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

## ప్రారంభమైన అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాలు



అభిషేకం చేస్తున్న పురోహితులు

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**
ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో 29వ(ఏకోనత్రింషత్) ఇష్టిసహిత బ్రహ్మోత్సవములు సోమవారము అత్యంత వైభవంగా ప్రారంభమైనట్లు ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, చైర్మెన్ సోమ సురేష్, తెలిపారు. మొదటిరోజు ఉత్సవాలలో భాగంగా స్వామివారి పల్లకిసేవ, ఉత్సవారంభ స్నపనము తదనంతరం మంగళా శాసనం కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సాయంత్రము సహస్రనామస్తోత్ర పారాయణ, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనము, రక్షాబంధనము, ఋత్విక్వరణ, మృత్సంగ్రహణ, అంకురారోపణ, ధ్వజపట అధివాసము, వైనతేయప్రతిష్ఠ, తిరుచ్చిపల్లకి సేవలు భక్తుల కోలాహలం మధ్య జరిగాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, ఎండ తీవ్రత ను దృష్టిలో పెట్టుకొని మంచినీరు, మజ్జిగ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, గౌరిశెట్టి అరుణ్‌కుమార్, చిలుక ఉపేందర్‌రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంథి రమేష్, మాలే శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బాటసారులకు చలివేంద్రం ఉపశమనం

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** చలివేంద్రం ఏర్పాటు చేయడం వల్ల బాటసారిలకు వేసవిలో ఎంతో ఉపశమనం కలుగుతుందని బిజెపి రాష్ట్ర నాయకులు శ్రీకాంత్, బిజెపి ఎస్సీ మోర్చా మల్కాజ్గిరి కోకన్వీనర్ కృష్ణప్రకాష్ పేర్కొన్నారు.సిస్టంబోల్ట్ ఆఫీస్ డైరెక్టర్ బత్తుల సుమన్‌గౌడ్ ఆధ్వర్యంలో భారత్ చైతన్యపురిలో భారత్‌మాత చిత్రపటానికి పూలమాలవేసి వారు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటుతో ఎంతో మందికి ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన సుమన్‌గౌడ్‌ను వారు అభినందించారు. రోజురోజుకు తీవ్రమవుతున్న వేసవి ఎండలకు చలివేంద్రాలు ఉపశమనాన్ని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పర్ల శివ, రామ్మోహన్, అంజిబాబు, వెంకటేష్ మామ, భానుప్రసాద్, రవి, అర్జున్‌సింగ్, భాస్కర్‌గౌడ్, అమూల్యరెడ్డి, భార్గవ్, చింటూ, సందీప్ పాల్గొన్నారు.

## గడపగడపకు జైబాపూ జైభీమ్ జైసంవిధాన్



కార్యక్రమంలో పాల్గొన్న పున్న గణేష్ నేత

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ కృష్ణానగర్‌కాలనీలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంమాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, జైబాపూ జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమ కోఆర్డినేటర్ భార్గవ్‌రామ్ ఆదేశాల మేరకు ఆదివారం శ్రీకిల్లామైసమ్మ అమ్మవారి దేవాలయం నుండి కృష్ణానగర్ కాలనీ వరకు గడపగడపకు ర్యాలీగా తిరుగుతూ రాజ్యాంగ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు పున్న గణేష్‌నేత మాట్లాడుతూ జైబాపూ జైభీమ్ జైసంవిధాన్ అనే కార్యక్రమం, జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి ప్రజల వద్దకు వెళ్లి స్వాతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూధన్‌రావు, శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ఛైర్మెన్ తలాటి రమేష్‌నేత, సురేంద్రకుమార్, మహమ్మద్, బొడ్డుపల్లి మహేందర్, సందీప్, పెద్దవూర సైదులు, పగిళ్ల భూపాల్‌రెడ్డి, యాదవరెడ్డి, జెల్ల జగన్నాథం, దొర్నాల చంద్రమౌళి, బండి గోపాలరావు, పగడాల ఎల్లన్న, హైమ్మద్, సమ్మద్, కవిత, జహంగీర్, మాధవి, ప్రమీల, శ్వేత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ లక్ష్మినగర్‌లో క్యాండిల్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**
జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మినగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. లక్ష్మినగర్ కాలనీ పార్కు నుంచి ప్రారంభమైన ర్యాలీ వినయ్‌నగర్, ప్రశాంత్‌నగర్ మీదుగా థీమ్ పార్కు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడి దేశ భద్రతకు పెను సవాలు విసురుతుందని, ఇలాంటి చర్యలను యావత్తు సమాజం ముక్తకంఠంతో ఖండించాలన్నారు. అనంతరం పెహల్గాం మృతుల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిఎస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, అకిల భారత గోసేవా ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణగౌడ్, బిజెపి నాయకులు వీరేందర్ యాదవ్, రాంరెడ్డి, వేణుగౌడ్, కాలనీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, శ్యాం సుందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రఫుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారతీయ స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షుడిగా వింజమూరి రాఘవాచారి




అఖిల భారతీయ స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న వింజమూరి రాఘవాచారి

**సైదాబాద్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** అఖిల భారతీయ స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షుడిగా ఎల్బినగర్ నియోజకవర్గం చంపాపేటకు చెందిన వింజమూరి రాఘవాచారి నియమితులయ్యారు. అఖిల భారత స్వర్ణకార సంఘం అధ్యక్షుడు యశ్పాల్ చౌహాన్ అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి రవివర్మ ఆధ్వర్యంలో బీహార్‌లోని బుద్ధగయలో అఖిల భారత స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అఖిల భారత స్వర్ణకార సంఘం నూతన నూతన ఉపాధ్యక్షుడిగా వింజమూరి రాఘవాచారి, సంయుక్త కార్యదర్శిగా కందుకూరి పూర్ణాచారి, రాగిఫని రవీంద్రచారి, ముఖ్య సలహాదారులుగా జల్లపల్లి పెంటయ్యాచారి, సిసి సభ్యులుగా చేపూరి వెంకటస్వామి, గొట్టిముక్కల చంద్రశేఖర్, రామోజు రవీంద్రచారి, కీసరి శ్రీకాంత్‌చారి, మంచోళ్ల రాజమౌళి, గొన్న బొత్తుల వెంకటేశ్వర్‌రావు, కందుకూరి నాగరాజు, సుంకోజు పోతులూరచారి, రుద్రోజు సుగ్రీవచారి, మహిళా ప్రతినిధిగా నారోజు మనోరమ, రుద్రోజు పద్మలు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా వింజమూరి రాఘవాచారి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చేకూరి వెంకటస్వామి, కోశాధికారి గొట్టుముక్కల చంద్రశేఖర్, సంఘం సీనియర్ నాయకులు జల్లపల్లి పెంటయ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

## మేడేను కార్మికులు విజయవంతం చేయాలి: దాసరి బాబు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు అధ్యక్షుడు దాసరి బాబు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలో మే 1వ తేదీన జరిగే ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలను అన్ని రంగాల కార్మికులు విజయవంతం చేయాలని విజయవంతం చేయాలని మండల సిఐటియు అధ్యక్షుడు మీర్‌పేట్ దాసరి బాబు పిలుపునిచ్చారు. సోమవారం బాలాపూర్ చౌరస్తా లోని లేబర్ అడ్డాలో కార్మికులతో కలిసి మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ మేడే ఉత్సవాన్ని కార్మికులందరూ పండుగలా జరుపుకోవాలనీ కార్మిక పతాకాలను రెపరెపలాడించాలని సూచించారు. కార్మికులు ఐక్యత చాటి మేడేను జయప్రదనం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు బాలాపూర్ మండల అధ్యక్షుడు యాదగిరి చారి, సీనియర్ నాయకుడు ప్రకాశ్, బాలాపూర్ చౌరస్తా లేబర్ అడ్డా ప్రెసిడెంట్ గట్టు వీరయ్య, ఉపాధ్యక్షుడు సురేష్, కార్యదర్శి సత్యం, నాయకులు జగన్, సత్యనారాయణ, స్వామి, రమణ, సిఐటియు నేతలు నాయక్, నర్సింహ, వెంకటయ్య, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడి మృతుల ఆత్మకు శాంతి కలుగాలని ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

**నాచారం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** కాశ్మీర్ పహల్గాం ఉగ్రవాదులు దాడిలో బలైన బాదిత కుటుంబాలకు న్యాయం చేయాలని, వారి ఆత్మకు శాంతి కలుగాలని కోరుతూ మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ 5వ డివిజన్ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఎలిఫెంట్ సర్కిల్ నుంచి కొవొత్తులతో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా మల్లాపూర్ డివిజన్ ఆర్డినేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు,బొంగోని ఉమేష్, సుదర్శన్, దంతురి రాజు, శ్రీకాంత్ రెడ్డి, బాలరాజ్, కిట్టు, ముజీబ్,శ్రీనివాస్, జోష్, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు దేశ అభిమానులు పాల్గొన్నారు.

## కొమురెల్లి మల్లన్నను దర్శించుకున్న నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

**తార్నాక, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి,టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి సిద్దిపేట్ జిల్లా కొమురెల్లి మల్లన్నను దర్శించుకున్నారు.శ్రీమల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్బంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, "కొమరవెల్లి మల్లన్న స్వామి దర్శనం చేయడం మా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలకు సేవ చేయడానికి మరింత శక్తి కలుగుతుంది" అని తెలిపారు. అలాగే, ఆలయ అభివృద్ధి, దైవీయ సౌందర్యం పెంపొందించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. దేవస్థాన పరిసర ప్రాంతాల శుభ్రత, సౌకర్యాలు మెరుగ్గా ఉండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, దేవస్థాన అధికారులు, మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దళితజన సమితి కార్యకర్త కళ్యాణ్‌ను పరామర్శించిన, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొజ్జ రమేష్

**తార్నాక, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :**
రోడ్డు ప్రమాదంతో గాయాలకు గురైన దళిత జన సమితి కార్యకర్త గంధం కళ్యాణ్ ను దళిత జన సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొజ్జ రమేష్ తన నివాసానికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. డీజే ఎస్ తన కార్యకర్తలకు ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రమేష్ పేర్కొన్నారు.



తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా నియమితులైన రామకృష్ణారావును సన్మానిస్తున్న రాష్ట్ర మాలల ఐక్య వేదిక అధ్యక్షుడు బేర బాలకిషన్, కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ మాజీ డైరెక్టర్ బబ్బూరి ఆనంద్‌కుమార్ గౌడ్ (సరూర్‌నగర్, ప్రభాతవార్త)